

గాజులదిన్నె ప్రాజెక్టులో ఉన్న నీరు

తాగునీటి సమస్య లేనట్టే

- జీడీపీలో 1 టీఎంసీ నీరు
- రోజుకు 30 క్యూసెక్కుల నీరు ఆవిరి
- జూన్ చివరి వరకు సరిపోతుందని అధికారుల అంచనా

గోనెగండ్ల, మే 14(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది తాగునీటి పథకాలకు నీటి సమస్య లేనట్టే. గాజులదిన్నె ప్రాజెక్టు(జీడీపీ)కు హంద్రీనీవా, ఎల్లెల్సీ నీరు మళ్లించడంతో ప్రస్తుతం 1 టీఎంసీ నీరు నిలువ ఉంది. ఈ ఏడాది వేసవిలో ప్రాజెక్టు కింది తాగు నీటి పథకాలకు నీటి కొరత ఉండదని అధికారులు భావిస్తున్నారు. ఈఏడాది ప్రాజెక్టు కింద 13వేల ఎకరాల్లో ఆయకట్టు సాగుకు ఏప్రిల్ నెల 15వ తేదీ వరకు నీరు విడుదల చేశారు. చాలామంది రైతులు వేరుశనగ, పత్తి, మొక్కజొన్న, శనగ, ఆముదాలు, కొర్రను సాగుచేస్తున్నారు. రైతులకు అవసరమైన సమయంలో మాత్రమే నీటిని విడుదల చేశారు. జీడీపీ అధికారులు ముందు జాగ్రత్తలో భాగంగా నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టారు. ఈకారణంగా మండుల వేసవిలో సైతం గాజులదిన్నె ప్రాజెక్టు నీటితో కళకళలాడుతుంది.

రోజుకు 10 క్యూసెక్కుల నీరు

ఈ ఏడాది గాజులదిన్నె ప్రాజెక్టులో ఇప్పటికి 1 టీఎంసీల నీరు ఉంది. ప్రాజెక్టు కింద తాగునీటి పథకాలు బండగట్టు, డోన్, క్రిష్ణగిరి ఉన్నాయి. ఈ పథకాలకు ప్రతి రోజు జీడీపీ నుంచే నీరు విడుదల అవుతుంది. ఈ మూడు పథకాలకు రోజుకు 10 క్యూసెక్కుల నీరు విడుదల చేయాల్సి ఉంటుంది. అవసర సమయంలో కర్నూలు, కోడుమూరు, గూడురు, బెళగల్, లద్దగిరి, ప్రాంతాలకు నీరు ప్రాజెక్టు నుంచి మళ్లించాల్సి ఉంటుంది.



తాగునీటి పథకాలు

ఈ ఏడాది 13వేల ఎకరాల్లోపు..

జీడీపీ కింద ఆయకట్టుదారులు ఈఏడాది 13వేల ఎకరాల్లోపు పంటలు సాగుచేసుకున్నారు. వారికి ఏప్రిల్ నెల 15 వరకు నీటి విడుదల చేశారు. 1టీఎంసీ నీరు ఈవేసవి జూన్ నెల చివరి వరకు తాగునీటి పథకాలకు సరిపోతుందని ఇరిగేషన్ అధికారులు లెక్కలు వేస్తున్నారు.

వేసవిలో నీరు ఇంకిపోవడం..

ప్రాజెక్టులో నీరు దాదాపు 24 కిలోమీటర్లు పరిధిలో విస్తరించింది. వేసవిలో భూమిలోకి నీరు ఇంకిపోవడం, ఆవిరి రూపంలో కొంతనీరు వృథా అవుతోంది. చుట్టుపక్కల రైతులు పైపులు, మోటార్లతో నీటి వినియోగించుకుంటున్నారు. దీంతో ఇప్పటి నుంచి రోజుకు 30 క్యూసెక్కుల నీరు వృథా అవుతుంది. అయినా తాగునీటి పథకాలకు నీటి ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు.

మద్దతు ధర ఏదీ..?

- కల్లాల్లోనే వరి ధాన్యం
- ప్రారంభించని కొనుగోలు కేంద్రాలు
- పెరిగిన పెట్టుబడులు
- నష్టాల్లో అన్నదాతలు

హాలహర్వి, మే 14 (ఆంధ్రజ్యోతి): అన్నదాతకు అడుగడుగునా కష్టాలు తప్పడం లేదు. అకాలవర్షాలు.. పాలకుల నిర్లక్ష్యం.. ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు ఇవన్నీ రైతుల కళ్లల్లో కన్నీటిని మిగిలిస్తున్నాయి. ఈ యేడాది రబీలో ఎల్లెల్సీ ఆయకట్టు కింద సాగుచేసిన రైతులు నష్టాలు బాట పట్టారు. జిల్లాలో సాగుచేసిన 80 వేల ఎకరాల్లో వరి పంట ధాన్యం కల్లాల్లోనే కొనేవారు లేక మిగిలిపోయింది. ప్రభుత్వం మద్దతు ధర ఇస్తుందన్న ఆశలు అడియాశలయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన వరి పంట అమ్ముకోలేక నలిగిపోతున్నారు. గత్యంతరం లేక వచ్చిన వ్యాపారులకు బలవంతంగా వరి ధాన్యాన్ని అమ్మేసుకుని రైతులు నష్టాల పాలు అవుతున్నారు.



నేలకు ఒరిగిన వరి పంట

పెరిగిన కూలీల ధరలు

ఈ యేడాది కూలీల ధరలు విపరీతంగా పెరిగాయి. వరి నాటు వేసేటప్పుడు ఎకరాకు రూ.5 వేలు చేశారు. పెరిగిన పురుగు మందులు, రసాయన ఎరువులు కలిపి ఎకరాకు రూ.40 వేలు పెట్టుబడులు వచ్చాయి. వీటితోపాటు దిగుబడులు తగ్గడంతో 35 బస్తాలు మించలేదు. కౌలు రైతులకు మరింత నష్టాలు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొనుగోలు కేంద్రాలు లేక..

రైతుల ధాన్యాన్ని ప్రభుత్వ కొనేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. దీంతో దళారులకు విక్రయించే పరిస్థితులు నెలకొన్నాయి. ధాన్యం తేమ ఉన్నాయని బరువు అని, తాలు మట్టి ఉన్నాయంటూ 73 కిలోల బస్తాకు మూడు కిలోల తరుగు పేరుతో దోపిడీ చేస్తున్నారు. కంప్యూటర్ కాటా లేకపోవడంతో తూకాల్లోనూ మోసాలు ఉన్నాయి. దీంతో ఒక బస్తాకు నాలుగైదు కిలోల తరుగు పేరుతో దగా చేస్తున్నారు. ధర సైతం రూ.1800 నుంచి రూ.1850కి కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారు.

ఆత్మహత్యలే శరణ్యం



రైతుల ప్రభుత్వం ఆదుకోవాలి. లేదంటే ఆత్మహత్యలే శరణ్యం. రబీలో పండించిన వరి పంటను కొనేవారు లేరు. వాతావరణ పరిస్థితుల వల్ల మేమే బలవంతంగా దళారులు ఆశ్రయించి నష్టాలకు ధాన్యాన్ని అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.
- వీరేశప్ప, రైతు, గూళ్యం

కొనుగోలు కేంద్రాలకు అనుమతులు లేవు



రబీలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు రాలేదు. దళారుల వల్ల వాస్తవంగా రైతులకు నష్టం జరుగుతుంది.
- శివశంకర్, వ్యవసాయాధికారి, హాలహర్వి

యంత్రాల కోసం..

అకాల వర్షాలు, ఈదురుగాలులు వరి రైతు వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. త్వరగా కోతలు కోసుకోవాలంటే యంత్రాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి అధిక ధరలకు యంత్రాలను తీసుకొచ్చి వరి కోతలు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈదురుగాలులకు వరి పంట అంతా నేలకు ఒరగడంతో ఎకరా వరి కోత గంటకు పూర్తి కావాల్సిందిపోయి ఏకంగా గంటన్నర వరకు సమయం పట్టే పరిస్థితి నెలకొంది. దీన్ని అదునుగా భావించిన దళారులు వరికోత యంత్రాల రేట్లను పెంచేశారు. రూ.2500 ఉండాల్సిన ధర గంటకు రూ.3200 పెంచేశారు. వరి కోతలన్నీ ఒకేసారి రావడంతో యంత్రాలకు మరింత డిమాండ్ పెరిగింది.



గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

పాణ్యం, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలపనూరు పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మేరీ సలోమి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి అడ్మిషన్లు పొందాల్సిన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. మూడో తరగతి ప్రవేశానికి చెంచు బాలికలకు 75 సీట్లు, ఎస్సీలకు 2 సీట్లు, ఓసీలకు 1, బీసీలకు1, ఇతరులకు 1 చొప్పున మొత్తం 80 సీట్లు కేటాయించినట్లు తెలిపారు. కేవలం చెంచు బాలికలకు మాత్రమే నాలుగో తరగతికి 66 సీట్లు, 5వ తరగతికి 70 సీట్లు, 6వతరగతికి 65, 7వతరగతికి 59 సీట్లు, 8వతరగతికి 60 సీట్లు, 9వతరగతికి 49 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ప్రకాశం, గుంటూరు, కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన బాలికలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీలోగా దరఖాస్తులను పాఠశాలకు అందజేయాలన్నారు. వివరాలకు 8106979149, 7989834662, 7013582204 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఇంటర్ పరీక్షల్లో 515మంది గైర్హాజర్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో బుధవారం 515 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలో 11,064 మంది విద్యార్థులకు గానూ 10656 మంది హాజరు కాగా 408 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అలాగే ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షకు 2074 మంది నమోదు చేసుకున్నారు. ఇందులో 1967 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా, 107 మంది గైర్హాజరయ్యారు. మొత్తం ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 515 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో గురువయ్య శెట్టి తెలి పారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు. పరీక్ష కేంద్రాలను కన్వీనర్, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురు వయ్య శెట్టి, డీవీఈవో సురేష్‌బాబు, జిల్లా డీఈసీ సభ్యులు, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ సభ్యులు పర్యవేక్షించారు.

పాలిసెట్‌లో బాలికలదే హవా

జిల్లా ఉత్తీర్ణత 94.39 శాతం



కర్నూలు ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ కళాశాల ప్రవేశాల కోసం నిర్వహించిన పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. జిల్లాలో 95.98 శాతం ఉత్తీర్ణత సాధించి బాలికలే పైచేయిగా నిలిచారు. గత నెలలో పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరిగింది. కర్నూలు జిల్లాలో 7,366 మంది పాలిసెట్ కు దరఖాస్తు చేసుకోగా, 6,442 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో బాలురు 4,947 మంది విద్యార్థులకు గానూ 4,394 మంది హాజరయ్యారు. ఇందులో 553 మంది గైర్హాజర య్యారు. అలాగే బాలికలు 2,419 మంది నమోదు చేసుకోగా, 2,041 మంది పరీక్షకు హాజరయ్యారు. బాలురు 4,395 మందికి గానూ 4,116 మంది అర్హత సాధించి 93.65 శాతం, బాలికలు 2,040 మందికి గానూ 1,958 మంది అర్హత పొంది 95.98 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 6,074 మంది ఉత్తీర్ణతతో 94.39 శాతం సాధించారు. ఎస్వీయూ రీజియన్‌లో అనంత తేజస్విని 117 మార్కులతో 231వ ర్యాంకు, దాసరి శృతి 117 మార్కులతో 250వ ర్యాంకు బండా చంద్రశేఖర్ 116 మార్కులతో 322వ ర్యాంకు సాధించారు.

నేటి నుంచి టీచర్ల బదిలీ


- ఈ ప్రక్రియ పారదర్శకంగా చేపడుతాం
- డీఈవో శామ్యూల్‌పాల్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ యజమాన్య పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ గురువారం నుంచి ప్రారంభం కానున్నట్లు డీఈవో శామ్యూల్ పాల్ తెలిపారు. బుధవారం స్థానిక బళ్లారి రోడ్డులో ఉన్న సెయింట్ క్లారెట్ పాఠశాలలో ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని కేటగిరీల్లో కలిపి 2798 ఖాళీలు ఉన్నాయన్నారు. ప్రధానోపాధ్యాయులు-5, ఉపాధ్యాయులకు 8 సంవత్సరాల సర్వీసు పూర్తిచేసిన ఖాళీలు 2713 ఉన్నాయన్నారు. స్కూల్ అసిస్టెంట్ కన్వర్ట్ ద్వారా 251, ఎస్‌జీటీ కన్వర్ట్ ద్వారా 93 పోస్టులు, అప్‌గ్రేడ్ ద్వారా 100 పోస్టులు, కొత్తగా సృష్టించిన ఖాళీలు 1449, సర్‌ప్లస్ (మిగులు) పోస్టులు 1143 కలిపి మొత్తం 8047 ఖాళీలు జిల్లాలో ఉన్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక ఖాళీలు ఉన్న జిల్లాగా కర్నూలును గుర్తించినట్లు తెలిపారు. బదిలీలకు సంబంధించి అన్ని స్థాయిల ఖాళీలు రీ వెరిఫికేషన్ చేస్తారన్నారు. బదిలీల ప్రక్రియ ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా జరుగుతుందన్నారు. కన్వర్షన్ ఆఫ్ స్కూల్ అసిస్టెంట్లు పోస్టుల కింద 251, ఆదర్శ ప్రాథమిక ప్రధానోపాధ్యాయుల పోస్టులుగా మంజూరయ్యాయని తెలిపారు. సర్‌ప్లస్‌గా ఉన్న 97 పోస్టలను అవసరమైన ఖాళీలకు అనుగుణంగా కన్వర్షన్ చేస్తామన్నారు. కొత్తగా 86 ఉన్నత పాఠశాలల హెచ్ఎం పోస్టులు, 957 స్కూల్ అసిస్టెంట్ల పోస్టులు, 406 ఎస్‌జీటీల పోస్టులు కలుపుకుని మొత్తం 1449 మంజూరైనట్లు తెలిపారు. జిల్లాలో 97 అప్పర్ ప్రైమరీ పాఠశాలలు ఉన్నత పాఠశాలలుగా ఉన్నతీకరించామన్నారు. జిల్లాకు అత్యధిక పోస్టులు మంజూరు కావడంపై జిల్లా విద్యాశాఖ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా కలెక్టర్, ప్రజాప్రతినిధులకు డీఈవో ధన్యవాదాలు తెలిపారు.

17న సీఎం చంద్రబాబు రాక

- సీ క్యాంపు రైతు బజారులో పర్యటన
- కేంద్రీయ విద్యాలయంలో ప్రజావేదిక
- ఏర్పాట్లపై కలెక్టర్ రంజిత్ బాషా సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, మే 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 17వ తేదీన కర్నూలు జిల్లాకు రానున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన సందర్భంగా ఏర్పాట్లపై కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను అప్రమత్తం చేశారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని, అక్కడి నుంచి సీ.క్యాంపు రైతుబజారులో ముఖ్యమంత్రి 'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. రైతుబజారులో ముఖ్యమంత్రి ఇద్దరు పారిశుధ్య కార్మికులు, ఇద్దరు రైతులతో మాట్లాడుతారన్నారు. అనంతరం నగరంలోని కేంద్రీయ విద్యాలయ సమీపంలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈసారి స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర థీమ్ 'బీట్ ది హీట్' అనే అంశంపై జరుగుతుందన్నారు. అందుకు అనుగుణంగా సీ.క్యాంపు రైతుబజారుతో పాటు నగరంలో కూడా స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర సందర్భంగా తగిన పారిశుధ్య చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. రైతుబజారు కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తారన్నారు. ఆదోని సబ్ కలెక్టర్ సహాయకులుగా ఉంటారన్నారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా సీ.క్యాంపు రైతుబజారులో తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజావేదికలో పీ-4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలు, మార్గదర్శకులతో మాట్లాడుతారన్నారు. పార్కింగ్ ప్రదేశాలను గుర్తించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ, ఆర్డీవో, ఆర్అండ్‌బీ ఎస్ఈలను కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు రాకుండా సీఎం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్, డీఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీవోలు భరత్ నాయక్, సందీప్ కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు చిరంజీవి, అజయ్ కుమార్, వెంకటేశ్వర్లు, కొండయ్య, అనురాధ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజావేదిక స్థల పరిశీలన

కల్లూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కల్లూరు అర్బన్ 20వ వార్డు పరిధిలోని కేంద్రీయ విద్యాలయ వద్ద సీఎం పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ పి.రంజిత్‌బాషా, పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత పరిశీలించారు. బుధవారం కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులను ఆదేశించారు. స్వచ్ఛంద్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా కర్నూలు జిల్లాకు విచ్చేయనున్న సీఎం ప్రజావేదిక సభలో పాల్గొంటారని తెలిపారు. ఈనేపథ్యంలో అధికారులు తీసుకోవలసిన చర్యలు, జాగ్రత్తలపై సూచనలు ఇచ్చారు. అనంతరం సీ.క్యాంప్‌లోని రైతు బజార్‌ను కూడా పరిశీలించారు. కార్యక్రమంలో కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు, నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, కమిషనర్


సారా రహిత గ్రామాలుగా ప్రకటించండి

- బెల్లం సరఫరాదారులపై బైండోవర్ కేసులు పెట్టండి
- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీదేవి
- ఉమ్మడి జిల్లాల సీఐలతో సమీక్ష



మాట్లాడుతున్న డీసీ శ్రీదేవి, పక్కన ఏసీ హనుమంతరావు

కర్నూలు అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): రెండు నెలలుగా సారా కేసులు నమోదు కాని గ్రామాలను గ్రామ కమిటీల ద్వారా సారా రహిత గ్రామాలుగా ప్రకటించాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్(డీసీ) శ్రీదేవి ఆదేశించారు. బుధవారం జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కార్యాలయంలో ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల సీఐలతో అసిస్టెంట్ కమిషనర్(ఏసీ) వి. హనుమంతరావుతో కలిసి నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవోదయం-2.0 అమలు చేస్తున్న విధానంపై పలు అంశాలను అడిగి తెలుసుకున్నారు. సారా తయారీదారుల నుంచి, బెల్లం సరఫరాదారులపై కేసులను నమోదు చేసి వారందరిని బైండోవర్ చేయాలని ఆదేశించారు. ప్రతి కానిస్టేబుల్‌కు బీట్ పరిధిని నిర్ణయించడం ద్వారా పనితీరుపై పటిష్టమైన ప్రణాళికలతో కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలన్నారు. సమస్యాత్మక గ్రామాల్లో పర్యటించి సారా తయారు కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, తెలంగాణ నుంచి వచ్చే సుంకం చెల్లించని అక్రమ మద్యంను అరికట్టాలన్నారు. సమావేశంలో సూపరింటెండెంట్లు మచ్చా సుధీర్‌బాబు, రవికుమార్, అసిస్టెంట్ సూపరింటెండెంట్లు రాజశేఖర్‌గౌడ్, రామక్రిష్టారెడ్డి, వి. రాముడు పాల్గొన్నారు.





బిల్వ సోయగం



ఎర్రజ్వాల గుహ



సహజసిద్ధంగా ఏర్పడిన బిల్వ గుహలు



సున్నపురాతి బిల్వ గుహ

- ఆకట్టుకున్న బిల్వ స్వర్గం గుహలు
- ప్రకృతి సహజ సిద్ధంగా వివిధ రూపాలు
- బేతంచెర్ల నుంచి ఐదు కిలోమీటర్లు
- 19వ శతాబ్దంలో పురావస్తు పరిశోధనలు
- ఎర్రజ్వాల గుహలు అని ప్రతీతి
- అరకొర సౌకర్యాలే అంటున్న సందర్శకులు

బేతంచెర్ల, మే 14 (ఆంధ్రజ్యోతి): బిల్వ స్వర్గం గుహలు అందాలు వర్ణించలేం. ఎర్రమల కొండల్లో ప్రకృతి సహజ సిద్ధంగా వివిధ రూపాలు కనిపించేలా నీళ్లు పారుతున్న విధంగా రమణీయంగా బిల్వ స్వర్గం గుహలున్నాయి. వివరాల్లోకి వెళితే.. బేతంచెర్ల మండలం కనుమకింద కొట్టాల గ్రామానికి కిలోమీటరు దూరంలో బిల్వ స్వర్గం గుహలు ఉన్నాయి. వీటిని ఎర్రజ్వాల గుహలు అని కూడా పిలిచేవారని కొట్టాల గ్రామస్థులు చెబుతున్నారు. ప్రస్తుతం బిల్వ స్వర్గం గుహలుగా పిలుస్తున్నారు. ఈ గుహలను 19వ శతాబ్దం మధ్యలో వీటిలో పురావస్తు, పేలియాంటాలజి పరిశోధనలు మొదలయ్యాయి. ఈ పరిశోధనల్లో పాతరాతియుగం నాటి దక్షిణ భారత పరిస్థితులు, అప్పటి మానవ జీవన స్థితిగతుల గురించి ఎన్నో విషయాలు తెలిశాయి. ఈ ప్రాంతంలో ఇటువంటి ఎన్నో సున్నపురాతి గుహలూ, గుహల సముదాయాలు ఉన్నప్పటికీ, బిల్వ స్వర్గంలోనే అత్యధికంగా పరిశోధనలు జరిగాయి. బిల్వ స్వర్గం గుహల్లో రెండు ప్రాథమిక గుహలు, మరి కొన్ని చిన్నగుహలూ కలిపి లోతైన గండి లేక బిలాలుగా ఏర్పడ్డాయి. వీటిని 1844లో న్యూబోల్డ్ అనే ఆంగ్లేయుడు కనుగొన్నా 1884లో రాబర్ట్ బ్రూస్ ఫ్రూట్ నేతృత్వంలో ఇక్కడ తవ్వకాలు మొదలయ్యాయి. ఈ బృందం ఈ గుహ సముదాయంలోని చార్నెల్ హౌస్, పర్గేటరి, క్యాథడ్రల్ గుహల్లో తవ్వకాలు జరిపింది. తవ్వకాలో పాతరాతియుగం నాటి ఎముకలతో చేసిన బాణపు అలుగులూ, ఈటెమొనలూ, చాకులు, ఉలులూ, పదునైన శూలాలతోపాటు జంతు అవశేషాలు కూడా లభ్యమయ్యాయి. అయితే ఈ ఆధారాల్లో ఎక్కువ శాతం లండన్‌కు తరలించే క్రమంలో కనుమరుగయ్యాయి. బేతంచెర్ల నుంచి బిల్వ స్వర్గం గుహలకు ఐదు కిలోమీటర్లు. కర్నూలు, బనగానపల్లె, డోన్ తదితర పట్టణాల నుంచి బిల్వ స్వర్గం గుహలు సందర్శించడానికి రోడ్డు సౌకర్యం కూడా ఉంది. బిల్వస్వర్గం గుహలకు వచ్చే సందర్శకులకు అరకొర సౌకర్యాలు అధికారులు ఏర్పాటు చేశారని పలువురు సందర్శకులు తెలుపుతున్నారు.

మల్లన్న సేవలో జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి శ్రీనివాస్



స్వామివార్ల శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేస్తున్న ఈవో

శ్రీశైలం, మే 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైల మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్లను బుధవారం జాతీయ ఎస్సీ కమిషన్ కార్యదర్శి జి.శ్రీని వాస్ దర్శించుకున్నారు. ఆలయ రాజగోపురం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ ఈవో ఎం. శ్రీనివాసరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కార్యదర్శి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో శ్రీనివాస్‌కు వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఆలయ ఈవో స్వామివార్ల శేషవస్త్రం, చిత్రపటాన్ని అందజేసి సత్కరించారు.

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలి

- డీఎస్‌డీవో ఎంఎన్‌వీ రాజు
- రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు



ఎంపికైన క్రీడాకారులతో జిల్లా సంఘం సభ్యులు

నంద్యాల హాస్పిటల్, మే 14, (ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి కలిగి ఉండాలని డీఎస్‌డీవో ఎంఎన్‌వీ రాజు అన్నారు. బుధవారం జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో 11ఏళ్ల లోపు విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లాకు చెందిన మన్‌విత్‌నాయక్, శివకార్తికేయ, రిషితాబాయి, సాయితేజస్ ఎంపికైనట్లు జిల్లా చెస్ సంఘం ప్రధాన కార్యదర్శి రామసుబ్బారెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 24, 25తేదీల్లో నరసరావు పేటలో జరిగే రాష్ట్ర స్థాయి ఓపెన్ బాల, బాలికల చెస్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారన్నారు. అనంతరం విజేతలకు పతకాలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా చెస్ సంఘం అధ్యక్షుడు డా.రవికృష్ణ, మునిశేఖర్, జిల్లా క్రీడాభారతి కార్యదర్శి సుధాకర్, ఆర్బిటర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం

- విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లకూడదు
- సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్



మాట్లాడుతున్న సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్

కర్నూలు స్పోర్ట్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా కృషిచేయాలని సెట్కూరు సీఈవో డా.వేణుగోపాల్ అన్నారు. బుధవారం జిల్లా యువజన సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో సర్వోదయ ఐటీఐ కళాశాలలో డ్రగ్స్ వినియోగంతో కలిగే నష్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రభుత్వాలు, సంస్థలు, కుటుంబాలు కృషి చేయాలని కోరారు. ఏ డ్రగ్‌నైనా వాడకూడని విధంగా వాడితే అది డ్రగ్ ఎబ్యూజ్ కిందకే వస్తుందని వివరించారు. డ్రగ్ ఎబ్యూజ్ వల్ల ఆరోగ్యం పాడవుతుందని, ఆర్థిక ఇబ్బందులు ఏర్పడుతాయని తెలిపారు. జ్ఞాపకశక్తి తగ్గిపోతుందని, అసలేమి నేర్చుకోలేని స్థితికి చేరుకుంటారని, అందుకే విద్యార్థులు డ్రగ్స్ జోలికి వెళ్లకూడదని తెలిపారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ, జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి సోమ శివారెడ్డి మాట్లాడుతూ డ్రగ్ వ్యాపారులు విద్యార్థులఎబలహీనతలను అవకాశం చేసుకొని వారి డ్రగ్ ఊబిలోకి లాగుతున్నారని అన్నారు. ఇలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సెట్కూరు పర్యవేక్షకులు శ్యాంబాబు, కళాశాల ప్రిన్సిపాల్ జీవరత్నం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కలసి ఉంటే కలదు సుఖం

కష్ట సుఖాలు, అనురాగం, ఆత్మీయ బంధాలు కలగలసిన అద్భుత ప్రపంచమే కుటుంబం. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, నాగరికతకు మూలం ఉమ్మడి కుటుంబం. పూర్వం సమష్టి కుటుంబంలో తల్లి తండ్రుల నీడలో అన్నదమ్ములు, అక్కాచెల్లెల్లు, కొడుకులు, కోడల్లు అంతా కలిసి పరస్పర సహకారంతో ప్రేమాభిమానాలతో పదిమంది మెచ్చుకునే విధంగా సుఖశాంతులతో కొనసాగించేవారు. ఎప్పుడూ ఏ సమస్య వచ్చినా ఒకరినొకరు సంప్రదించుకుంటూ పరిష్కార మార్గాన్ని తెలసుకునే వారు. ప్రస్తుత కాలంలో కుటుంబ వ్యవస్థ బలహీనపడుతున్న నేపథ్యంలో కుటుంబాల విలువలను తెలియజేసేందుకు ఐక్యరాజ్య సమితి 1993 మే 15న అంతర్జాతీయ కుటుంబ దినోత్సవాన్ని ప్రకటించింది.





- సమాజాన్ని, సంస్కృతిని కాపాడేది కుటుంబం
- భారతీయ వ్యవస్థలో ఉమ్మడి కుటుంబానికి ప్రత్యేక స్థానం
- నేడు అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం

నంద్యాల కల్చరల్, మే 14(ఆంధ్రజ్యోతి): కుటుంబ వ్యవస్థ నాశనం కాకుండా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కుటుంబంలో ప్రజాస్వామ్యయుతమైన మార్పులు నెలకొనాలి. పరస్పర గౌరవం, అనుగారం పునాదులుగా కుటుంబ సంబంధాలు బలపడాలి. కులాలు, మతాలు, వర్గాలు ఎన్ని ఉన్నప్పటికీ మనదేశంలోని ప్రజలందరూ ఒకే కుటుంబంగా జీవిస్తున్నారు. అందుకే మనదేశాన్ని ఉదారచరితానాంతు వసుధైక కుటుంబం అన్నారు. ఉమ్మడి కుటుంబాలలో ఉన్న ప్రేమ, ఆప్యాయతలు, అనురాగాలు మరే కుటుంబంలో కనబడవు. పరస్పరం సహకరించుకునే ధోరణి కూడా ఎక్కువగా ఈ కుటుంబాలలో అలవడుతుంది. క్రమశిక్షణాయుత పద్ధతులలో పిల్లలు పెరిగి పెద్దవారవుతారు. పెద్దలను గౌరవించే సంస్కృతి బాగా అలవడుతుంది. ఒకరి కష్టసుఖాలను మరొకరు పంచుకునే మంచి సద్గుణం అలవరుతుంది.

కుటుంబ ప్రాధాన్యతను గుర్తించిన ఐరాస

కుటుంబ వ్యవస్థ బలంగా లేకపోతే సమాజంలో ఎలాంటి దుష్పరిణామాలు ఎదురవుతాయో ఐక్యరాజ్యసమితి గ్రహించింది. కుటుంబ వ్యవస్థ బలహీనమవ్వడం మూలంగా సమాజంలో జరిగే దుష్పరిమాణాలు గ్రహించిన ఐక్యరాజ్యసమితి కుటుంబ వ్యవస్థను పటిష్ఠం చేయడం కోసం 1993, మే 15న అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం ప్రారంభించింది. కుటుంబ వ్యవస్థను ఎందుకు కాపాడుకోవాలో వివరిస్తూ సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించాలని సభ్యదేశాలకు పిలుపునిచ్చింది. ప్రతి సంవత్సరం మే 15 వ తేదీన 'అంతర్జాతీయ కుటుంబ దినోత్సవం'గా పరిగణించి ప్రజా చైతన్యానికి విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

అనురాగ బంధాల 'అన్నెం' ఫ్యామిలీ

కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు సమీపంలోని గెలాక్సీ పామ్ హౌస్‌లో అన్నెం ఇంటి పేరుగల కుటుంబం ప్రతిఏటా ఓ రోజు అంతా కలుసుకుని సంతోషంగా గడుపుతారు. అప్పటి ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రస్తుతం ప్రకాశం జిల్లా కంభం మండలంలోని లింగాపురానికి చెందిన అన్నెం కుటుంబీకులు ఆత్మీయ సమ్మేళనం పేరుతో రోజంతా విందువినోదాలతో ఆత్మీయ పలకరింపులతో ఆనందంగా గడుపుతారు. అన్నెం ఉల్లక్కి రెడ్డి, అన్నెం నాంచార రెడ్డి కుటుంబాలకు చెందిన నాలుగు తరాల కుటుంబ సభ్యులు ఉ ద్యోగరీత్యా, వ్యాపారరీత్యా దేశ విదేశాల్లో నివసిస్తున్నారు. వారం తా ఒక చోట చేరి తమ ఆత్మీయతను చాటుకోవడం విశేషం. తాజాగా ఈ ఏడాది ఫిబ్రవరి పదో తేదీన కుటుంబంలోని 150 మంది కలిసి ఉమ్మడి కుటుంబ ప్రాధాన్యతను చాటి చెప్పారు.



ఈ ఏడాది ఫిబ్రవరి పదో తేదీన 150 మందితో కలిసిన అన్నెం కుటుంబం



సీఎం చంద్రబాబుతో మంత్రి ఫరూక్ కుటుంబ సభ్యులు(ఫైల్)

ఎంత బిజీగా ఉన్నా ఫ్యామిలీ కోసం ఓ రోజు...

24 మందితో మంత్రి ఫరూక్ ఉమ్మడి కుటుంబం

నంద్యాల, మే14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కుటుంబంగా ఉంటే ఆ ఇంట్లో ఎప్పటికి సందడి వాతావరణం ఉంటుందని నిరూపిస్తున్నారు రాష్ట్ర న్యాయ, మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్. ఆయనకు ఐదుగురు కుమారులు, ఒక కుమార్తె. భగవంతుడి దయతో ఇప్పటికీ ఉమ్మడి కుటుంబంగానే తాము కొనసాగుతున్నామని ఆయన చెప్పుకొచ్చారు. హైదరాబాదు, నంద్యాలలో నివాసం ఉంటున్నాం. మొత్తంగా మా ఉమ్మడి కుటుంబంలో 24 మంది ఉన్నాం. నేను మంత్రి హోదాలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ వారంలో ఒక రోజు ఫ్యామిలీ కోసం కేటాయిస్తాను. ఆ ఒక్క రోజూ అందరూ కలిసి పిక్నిక్ వెళ్లి బయటే కలిసి భోజనం చేస్తాం. మా ఉమ్మడి కుటుంబాన్ని చూసి సీఎం చంద్రబాబు నాయుడు చాలా మురిసిపోయేవారు. అందరూ ఒకే కుటుంబంలో కలిసి ఉండటంలో ఎంతో సంతోషం ఉంటుంది. ఉమ్మడిగా ఉంటేనే ఏదైనా సాధించేందుకు వీలుగా ఉంటుంది. ఉమ్మడి కుటుంబ బంధం ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతుంది. ఇటీవల నా సతీమణి మృతి చెందడం కుటుంబానికి తీరని లోటుగా మారింది. భవిష్యత్‌లో కూడా మా కుటుంబం ఉమ్మడిగా ఉండాలని కోరుకుంటున్నా. ఇదే తరహాలో ప్రతిఒక్కరూ ఆలోచిస్తే బాగుంటుంది.

ఆడ ఏడిస్ దోమకాటుతో డెంగీ

- డీఎంహెచ్‌వో డా.పి.శాంతికళ
- రేపు జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

కర్నూలు హాస్పిటల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆడ ఏడిస్ దోమకాటుతో డెంగీ వైరస్ వ్యాప్తి చెందుతుందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అన్నారు. బుధవారం డీఎంహెచ్‌వో చాంబర్‌లో ఆమె ప్రోగ్రాం ఆఫీసర్లతో కలిసి జాతీయ డెంగీ దినోత్సవ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ ఈ నెల 16వ తేదీన జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హఠాత్తుగా వచ్చే తీవ్రమైన జ్వరం, తలనొప్పి, కీళ్ల నొప్పులు, ఆకలి మందగించడం, వాంతులు డెంగీ వ్యాధి లక్షణాలు అన్నారు. దోమలు కుట్టకుండా దోమతెరలు వాడటం, ముందస్తు జాగ్రత్తల చర్యలతో డెంగీని నివారించొచ్చునన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి ఏ.నూకరాజు, డీఐవో డా.నాగప్రసాద్, ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.శైలేష్ కుమార్, డీపీఎంవో డా.ఉమా, డెమో శ్రీనివాసుల శెట్టి, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి డా.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ శశికళ

కుటుంబ బంధాలు బలపడాలి



భావితరాల ఉజ్వలభవితకు దిశానిర్దేశం, ప్రేమ, వాత్సల్యం అన్నీ ఉమ్మడి కుటుంబం నుంచే అలవాటు అవుతాయి. వియ్యం నెయ్యం, సోదరభావం కలగలసిన భారతీయ కుటుంబం నిజంగా వసుధైక కుటుంబమే. పాత తరాలకు ఆసరాగా భావితరాలకు ఆలంబనగా విలువల పునాదులపై నిలబడేది కుటుంబం. కుటుంబ బంధాలు బలపడితే విలువలతో కూడిన సమాజం ఏర్పడుతుంది. ఉమ్మడి కుటుంబంలో ఉన్న ఆనందం విడిగా ఉంటే రాదు.

\- శంకర్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి, నంద్యాల

సహకారానికి తొలి వేదిక కుటుంబం



జీవనశైలిలో కొత్త అనుభవాలెదురైనా ఏనాటికానాడు నూతనత్వాన్ని సంతరించుకున్నది కుటుంబం. భారతీయ జీవన శైలిలో కుటుంబానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. నైతిక విలువలకు పెద్దపీట వేసి పిల్లలను తీర్చిదిద్దేది ఉమ్మడి కుటుంబంలోనే. కష్టాలను కలసికట్టుగా పరిష్కరించుకుంటూ ఉమ్మడి కుటుంబంగానే ఉంటే మంచిది. విడిపోయి దూరంగా ఉంటే భవిష్యత్ పిల్లలకు ఎవరు మంచి, చెడుల గురించి చెబుతారు.

\- వీరబ్రహ్మం, రిటైర్డ్ ఉపాధ్యాయుడు, నంద్యాల

ఏపీఆర్‌డీసీ సెట్‌లో గూడూరు విద్యార్థి ప్రతిభ

రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు



కోటకొండ విజయ్

కర్నూలు ఎడ్యుకేషన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గురుకుల రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ కామ న్ ఎంట్రెన్స్ టెస్ట్ సెట్‌లో గూడూరు విద్యార్థి ప్రతిభ కనబరిచాడు. మండలంలోని మునగాలకి చెందిన చిన్నరాముడు కుమారుడు కోటకొండ విజయ్ 109/150 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. బుధవారం గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బీఎస్సీ జువాలజీ గ్రూపు విభాగంలో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ మంగరాజ కుమారుడు కే.కిరీటి 74/150 మార్కులతో రాష్ట్ర స్థాయిలో ర్యాంకు సాధించాడు.

గాంధీనగర్‌లో యువకుడి మృతి

కర్నూలు క్రైం, మే 14 (ఆంధ్రజ్యోతి): టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గాంధీ నగర్‌లో శరణ్య ఎన్‌క్లేవ్ అనే భవనంపై నుంచి కింద పడి శివ(20) అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. వెల్దుర్తి మండలం శ్రీరంగాపురం గ్రామానికి చెందిన జయరాముడు గొర్రెల పెంపకంతో జీవనం చేస్తుంటాడు. ఈయనకు ఇద్దరు కొడుకులు సంతానం. పెద్ద కొడుకు శివ ఇంటర్ పూర్తి చేశాడు. ఈ నెల 1వ తేదీ నుంచి అబ్దుల్లా ఖాన్ ఎస్టేట్‌లో ఉన్న ఓ రెస్టారెంటులో వెయిటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ రెస్టారెంటుకు సంబంధించిన గాంధీనగర్‌లోని శరణ్య ఎన్‌క్లేవ్ అనే భవనంలో శివ, ఇదే రెస్టారెంటులో పని చేసే శ్రీనివాసులు, హరి, కృష్ణ నివాసం ఉంటున్నారు. బుధవారం భవనంపై నుంచి పడ్డాడు. ఇదే రూములో నివాసం ఉండే హరి, మరి కొంత మంది కలిసి వెంటనే చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన కుమారుడి మృతిపై శ్రీనివాసులు, హరి, కృష్ణ, రెస్టారెంటు మేనేజర్ మహ్మద్ రఫీపై అనుమానం ఉందని యువకుడి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు. మృతుని అరచేతిపైన తండ్రి ఫోన్ నెంబర్లు రాసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

శ్రీశైలంలో మద్యం పట్టివేత

శ్రీశైలం, మే 14(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం దేవస్థానం టోల్‌గేట్ వద్ద బుధవారం సీఐ జి.ప్రసాదరావు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరు మహిళలు ఆర్టీసీ బస్సులో మద్యం బాటిళ్లను తీసుకు వస్తుండగా పోలీసులు పట్టుకున్నారు.



మద్యం సీసాలతో పోలీసులు

శ్రీశైలం గ్రామానికి చెందిన బీబీ, పిక్కిలి రేణుక సున్నిపెంట నుంచి మద్యం బాటిళ్లు తీసుకు వస్తుండగా స్టిబందితో కలిసి వారిని అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 50 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భర్త మృతిని తట్టుకోలేక ఆత్మహత్య

- అనాథగా మారిన 18 నెలల చిన్నారి


లలిత (ఫైల్)

ఉయ్యాలవాడ, మే 14(ఆంధ్రజ్యోతి): భర్త మృతిని జీర్ణించుకోలేక భార్య ఆత్మహత్య చేసుకున్నది. ఈ ఘటన ఉయ్యాలవాడ మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పొగాకు నారాయణ ఈ నెల 6న మట్టి మిద్దె కూలి హఠాత్తుగా మృతి చెందాడు. దీన్ని జీర్ణించుకోలేక భార్య పొగాకు లలిత(35) బుధవారం తెల్లవారుజాము విషద్రావణాన్ని తాగింది. వాంతులు చేసుకుంటుం డగా తల్లి నారాయనమ్మ గమనించి, చుట్టు పక్కల వారికి చెప్పింది. వారు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించి అక్కడ ప్రథమ చికిత్స చేయించి అక్కడ నుంచి నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందింది.

అనాథగా మారిన చిన్నారి

మృతులు లలితమ్మ, నారాయణకు మూడు ఏళ్ల క్రితం వివాహం అయింది. వీరికి 18 నెలల క్రితం చిన్నారి పుట్టింది. వీరిద్దరూ మృతి చెందటంతో చిన్నారి అనాథగా మారింది. పాలు తాగే వయస్సులేనే తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారిని చూసినవారు కంటతడి పెట్టారు.

సారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణం నుంచి కొణిదేలకు వెళ్లే రస్తా జగనన్న కాలనీలో సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు బుధవారం దాడులు చేశారు. సీఐ రామాంజనేయులు మాట్లాడుతూ నీలి షికారి కాలనీకి చెందిన షీకారి రవి (30), షికారి నానాసింగ్ (32), షికారి భారతి (45) అనేటువంటి ముగ్గురు వ్యక్తులు మంగలి శ్రీనివాసులు(37) ఇంటిని అద్దెకు తీసుకుని సారా తయారు చేస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి 132 లీటర్ల సారా సీజ్ చేసి 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. అనంతరం మంగళి శ్రీనివాసులును, షికారి రవిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చామన్నారు. అలాగే షికారి నానా సింగ్ పరారీలో ఉన్నారు. షికారి భారతి పై నమోదైన కేసులో జిల్లా సబ్ జైలులో ఉన్నట్లు సమాచారం. ఆమె పై కూడా కేసు నమోదు చేసి వీరిని కూడా అరెస్టు చేస్తామని తెలిపారు. బెల్లం సరఫరా చేసిన షికారి రవిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్ఐ జఫరుల్లా, సిబ్బంది శంకర్ నాయక్, పద్మనాభం, కుమారి కానిస్టేబుళ్లు మధుసూదన్ ప్రసాద్, శివన్న, వీఆర్వో మాధవస్వామి, వీఆర్ఏ మహేష్ పాల్గొన్నారు.

ఆంగ్ల భాషపై పట్టు సాధించాలి


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ట్రస్టు సభ్యులు

కర్నూలు అర్బన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఆంగ్ల భాషపై పట్టు సాధిస్తేనే ఉద్యోగాలకు అవకాశాలు లభిస్తాయని పినాక కోర్సు డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. అందుకోసమే ఈనెల 17వ తేదీ నుంచి ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీష్, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నామని పినాక కోర్సు డైరెక్టర్, రాయలసీమ విద్యార్థి పోరాట సమితి అధ్యక్షుడు రవికుమార్ తెలిపారు. పినాక ప్రజాసాధికార ట్రస్టు, హైదరాబాద్ ఇన్‌కం టాక్స్ అడిషనల్ కమిషనర్ బి.యాదగిరి, అమీలియో హాస్పిటల్ అధినేత డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో కరపత్రాలను ఆవిష్క రించారు. నగరంలోని ఎన్ఆర్‌పేట ఎదురుగా శ్రీలక్ష్మీ హైస్కూల్‌లో శిక్షణ ఉంటుందని విద్యార్థులకు ఉచిత శిక్షణ, మెటీరియల్, మధ్యాహ్న భోజనం, అమ్మాయిలకు ఉచిత హాస్టల్ వసతి ఏర్పాటు చేశామన్నారు. వివరాలకు 9177764147, 9640969891లో సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ నేత లక్ష్మీనారాయణ హత్యకేసులో
ఏడుగురి అరెస్టు


నిందితుల అరెస్టును చూపుతూ వివరాలను వెల్లడిస్తున్న ఏఎస్పీ హుస్సేన్ పీరా, డీఎస్పీ, సీఐ, ఎస్ఐలు

ఆలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మార్పీఎస్ రాయలసీమ జిల్లాల అధ్యక్షుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ హత్యకేసులో మరో ఏడుగురిని బుధవారం అనంతపురం జిల్లా విడపనకల్ మండలం పెంచికలపాడు సమీపంలో అరెస్టు చేసినట్లు అదనపు ఎస్పీ హుసేన్‌పీరా తెలిపారు. ఆలూరు సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. గత నెల 27న గుంతకల్లు-చిప్పగిరి మార్గ మధ్యలో దారుణహత్యకు గురైన కాంగ్రెస్ నాయకుడు లక్ష్మీనారా యణ హత్య కేసులో ఆయన కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయితే మరో 11 మంది పాత్ర ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. ఇప్పటికే ఈ కేసులో 10 మందిపై కేసులు నమోదు చేయగా అందులో రాజేష్, గౌసియా, సౌభాగ్య, గుమ్మనూరు నారాయణను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిం చామని చెప్పారు. ఇందులో ప్రధాన నిందితుడిగా ఉన్న గుంతకల్లుకు చెందిన సారాయి పెద్దయ్య, మొలగవల్లి గ్రామానికి చెందిన మేకల శ్రీనివాసులు, గుంతకల్లుకు చెందిన బోయ గోవిందు, బోయ రాము, వడ్డే నవీన్, దొడ్ల మనోహర్, రామదుర్గానికి చెందిన జీర్ల ధనుంజయ లక్ష్మీనారాయణ హత్యలో పాలుపంచుకున్నట్లు తెలిపారు. అందరూ కలిసి లక్ష్మీనారాయణను పథకం ప్రకారం హత్య చేశారని చెప్పారు. కేసులు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారించి ఇంకా ఎవరి పాత్ర ఉందో గుర్తిస్తామన్నారు. వీరందరినీ అరెస్టు చేసి హత్యకు ఉపయోగించిన కత్తులు, ఇనుప రాడ్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. చిప్పగిరి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వైకుంఠం శివప్రసాద్, వైకుంఠం మల్లికార్జున, కొండ రామాంజనేయులు, అరికెర మల్లేష్‌పై కేసు నమోదు చేసి వారి పాత్రపై సాంకేతిక కోణాల్లో విచారించగా ఇందులో వారి పాత్ర ఎక్కడా లేదన్నారు. ఎవరైనా ఆధారాలు ఇస్తే విచారించి తదుపరి చర్యలు తీసుకుంటామని అదనపు ఎస్పీ తెలిపారు. సమావేశంలో డీఎస్పీ వెంకట్రామయ్య, సీఐ రవిశంకర్‌రెడ్డి, ఆలూరు, చిప్పగిరి, హొళగుంద ఎస్ఐలు మహబూబ్‌బాషా, శ్రీనివాసులు, దిలీప్ కుమార్, పాల్గొన్నారు.

అందుబాటులో అత్యాధునిక చికిత్సలు

- కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు
- స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో సర్జరీ సేవలు ప్రారంభం


ఆపరేషన్ థియేటర్ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న సూపరింటెండెంట్

కర్నూలు హాస్పిటల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో రాష్ట్రంలోనే అత్యాధునిక క్యాన్సర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్‌లో సర్జరీ సేవలను ఆయన క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ సర్వజన వైద్యశాల వైద్య రంగంలో విశిష్టమైన సేవలు అందిస్తోందని, సర్జికల్ అంకాలజీ, జనరల్ అంకాలజీలలో ఆపరేషన్లను వైద్యులు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలోనే గర్వించదగ్గ హాస్పిటల్‌ను తీర్చిదిద్దేందుకు ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో కర్నూలు జీజీహెచ్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బీవీ రావు, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.హేమనళిని, అనస్థీషియా హెచ్‌వోడీ డా.విశాల, ప్రొఫెసర్ డా.రామశివ నాయక్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డా.కిరణ్ కుమార్, వైద్యులు పాల్గొన్నారు.

వినియోగదారులను మోసం చేస్తే చర్యలు

- తూకాల యంత్రాలకు ముద్ర వేయించుకోవాలి
- తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి


మాట్లాడుతున్న జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి

కర్నూలు న్యూసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): దుకాణదారులు వినియోగదారులను మోసం చేస్తే చర్యలు తప్పవని తూనికలు, కొలతల శాఖ జాయింట్ కంట్రోలర్ గోపికృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ప్రపంచ లీగల్ మెట్రాలజీ దినోత్సవాన్ని పురస్కరించుకొని షరాఫ్‌బజార్‌లో బంగారు వ్యాపారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. తూకాల యంత్రాలు సంవత్సరానికి ఒక్కసారి డిపార్ట్‌మెంట్ ద్వారా సరిచే యించుకుని ముద్ర వేయించుకోవాలన్నారు. ప్రతి దుకాణంలో వెరిఫికేషన్ సర్టిఫికెట్ డిస్‌ప్లే చేయాలన్నారు. తుకాల యంత్రా లను ప్రతి రోజు వ్యాపారం ప్రారంభానికి ముందు బెలియన్ టెస్ట్ వెయిట్స్ ద్వారా చెక్ చేసుకోవాలన్నారు. డిప్యూటీ కంట్రోలర్ సీహెచ్.దయాకర్‌రెడ్డి, అసిస్టెంట్ కంట్రోలర్ శ్రీరాముడు పాల్గొన్నారు.

48 గంటల్లో 74 కేసులు..

నంద్యాల టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గడిచిన 48 గంటల్లో మద్యం తాగి, బహిరంగ మద్యపానం చేసిన వారిపై జిల్లాలో 174 కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. శాంతిభద్రతలో భాగంగా జిల్లాలో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించామన్నారు. సారా, అక్రమ మద్యం విక్రదారులపై 3కేసులు, 30 లీటర్ల నాటుసారా 39 క్వార్టర్ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. 48 గంటల్లో వాహన చట్టాన్ని ఉల్లఘించిన వారిపై 599 మందిని గుర్తించి 4,62,265 జరిమానాలు విధించినట్లు తెలిపారు. అలాగే 131 మంది నుంచి రూ.64,210 జరిమానాలు రీకవరి చేసినట్లు చెప్పారు. రోజూ రాత్రిళ్లు పహరా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వ్యక్తిపై కేసు నమోదు

గడివేముల, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెసరవాయి గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగార్జునరెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పెసరవాయి గ్రామానికి చెందిన చిన్న రఘుస్వామిరెడ్డి జొన్న ధాన్యాన్ని గడిగరేవుల గోడౌన్‌కు తీసుకెళ్లారు. జొన్నలు అన్‌లోడ్ చేయడానికి ట్రాక్టర్‌ను ముందుకు తీసుకెళ్లే విషయంలో మధుసూదన్‌రెడ్డి, చిన్న రఘుస్వామిరెడ్డి ఘర్షణ పడ్డారు. మదుసూదన్‌రెడ్డి రాయితో చిన్న రఘుస్వామి రెడ్డిపై దాడి చేయగా గాయాలపాలయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మార్కెట్ కార్యదర్శిపై చార్జెస్ ఫ్రేమ్

- ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ ఉత్తర్వులు జారీ
- 15 రోజుల్లో వివరణ ఇవ్వాలని ఆదేశం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నంద్యాల, మే14(ఆంధ్రజ్యోతి): నంద్యాల మార్కెట్‌యార్డులో జరిగిన అవకతవకలపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించిన పైసా వసూల్..!, అక్రమార్కుల్లో అలజడి..? ఆ ఇద్దరే కీలకం' కథనాలపై ఆ శాఖ ఉన్నతాధికారులు సీరియస్‌గా స్పందించారు. ఈ నేపథ్యంలో ఆశాఖ జేడీ రామాంజినేయులు లోతుగా విచారణ చేసి ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేశారు. దీంతో తాజాగా ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్ సదరు కార్యదర్శి ఎం.కల్పనపై తగిన అభియోగాలను మోపుతూ చార్జెస్ ఫ్రేమ్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నిధులు దుర్వినియోగమైనట్లు..

ఉత్తర్వులు ప్రకారం 8 రకాల ఆర్టికల్స్ కింద రూ. 30,40,361 నిధులు సదరు మార్కెట్‌యార్డు నిధుల్లో దుర్వినియోగమైనట్లు అభియోగాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రధానంగా పశువులు సంత, గోడౌన్ అద్దెలు, సిబ్బంది నియామకం, ఉన్నతాధికారుల అనుమ తులు లేకుండా సిబ్బందిని మార్పులు చేయడం, స్టేషనరీ, తదితర సామగ్రి కొనుగోలు వంటి అంశాల్లో ఎక్కువగా దుర్వినియోగం చేసినట్లు గుర్తించారు. పైగా నిబంధనలకు విరుద్ధంగా ఓ ఉద్యోగికి కారు రుణం మంజూరు కూడా చేసినట్లు గుర్తించారు. ఈ నేప థ్యంలో వచ్చిన అభియోగాల పరంగా సదరు అధికారి 15 రోజుల్లో తగిన వివరాలతో కూడిన సమగ్ర నివేదికను ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి అందజే యాల్సి ఉందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వేధింపుల కేసు నమోదు

కర్నూలు క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్‌స్టేషన్ పరిధిలో వెంకాయపల్లెకు చెందిన హరిప్రసాద్ అనే వ్యక్తిపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగి అయిన హరిప్రసాద్‌కు ఈ-తాండ్రపాడు చెందిన ఉమాదేవితో నాలుగు నెలల కింద పెళ్లయిందన్నారు. పెళ్లయిన కొద్ది రోజుల నుంచి అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నట్లు ఉమాదేవి ఫిర్యాదు చేసింది. బుధవారం వెంకాయపల్లెలో తన భర్త ఇంటి ముందు ధర్నా కూడా చేసింది. భర్త, బంధువులు ఇంటికి తాళం వేసి వెళ్లిపోవడంతో పోలీసు లను ఆశ్రయించింది. ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

సైనిక శక్తి భారతావనికే గర్వకారణం

- శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కొండయ్య
- అలరించిన 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్ కళారూపాలు



భరతమాత చిత్రపటానికి క్షీరాభిషేకం , దేశభక్తి నృత్య ప్రదర్శనలు చేస్తున్న కరీముల్లా బృందం

కర్నూలు కల్చరల్, మే 14 (ఆంధ్రజ్యోతి): పహల్గాం ఉగ్రదాడి అనంతరం దాయాది పాక్‌పై మనదేశ సైనిక శక్తి ప్రదర్శించిన తెగువ యావత్ భారతావనికే గర్వకారణమని శ్రీశైలం ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.కొండయ్య అన్నారు. నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో వారం రోజుల పాటు ఏర్పాటు చేసిన 'జై జవాన్' కల్చరల్ ఫెస్ట్ ఐదోరోజు బుధవారం కార్యక్రమాలను పి.కొండయ్య ప్రారంభించారు. తొలుత భరత మాత చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించి, జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగ్రవాదులను మట్టుబెట్టిన భారత సైన్యం పాత్ర ప్రపంచ పటంలో గొప్పగా నిలుస్తుందన్నారు. రాయలసీమ వాసి మురళీ నాయక్ వీరమరణం బాధాకరమని, ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు. టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ వారం రోజుల పాటూ ఏర్పాటు చేసిన జై జవాన్ కల్చరల్ ఫెస్ట్‌కు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్నారు. జవాన్ల త్యాగనిరతిని గుర్తిస్తూ కళాకారులు, గాయకులు, నాట్యాచార్యులతో దేశభక్తిని ప్రబోధించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీజీవీ కళాక్షేత్రం కార్యవర్గ సభ్యులు యాగంటీశ్వరప్ప, పి.రాజారత్నం, జీవీ శ్రీనివాసరెడ్డి, కేవీ రమణ, బాలవెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నేడు సాంఘిక నాటిక ప్రదర్శన

టీజీవీ కళాక్షేత్రంలో కొనసాగుతున్న కల్చరల్ ఫెస్ట్‌లో ఆరోరోజు గురువారం సాయంత్రం 6:30 గంటలకు 'బావా ఎప్పుడు వచ్చితీవు' హాస్య సాంఘిక నాటిక ప్రదర్శిస్తున్నట్లు కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య తెలిపారు. కళాక్షేత్రం సభ్యుడు సంగా ఆంజనేయులు దర్శకత్వంలో ప్రదర్శిస్తున్న ఈ నాటికలో కళాకారులు సంగా ఆంజనేయులు, మహ్మద్ మియ, చల్లా నవీన్ కుమార్ నాయుడు, బి.భాస్కర్, గొల్లపూడి రేణుక ప్రధాన పాత్రలు పోషిస్తారని తెలిపారు. అనంతరం నాట్యాచార్యులు నాగసాయి ప్రదీప్ శిష్య బృందంతో దేశభక్తి గీతాల నృత్య రూపకాలు ఉంటాయన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి ఉషూ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక టీజీవీ కల్యాణ మండపంలో జరుగుతున్న జూనియర్, సబ్ జూనియర్, సీనియర్ విభా గాల్లో 12వ ఉషూ రాష్ట్ర స్థాయి పోటీలు బుధవారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉషూ కర్నూలు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ బీ.శంకర్‌శర్మ హాజరై విజేతలకు జ్ఞాపికలు అంద జేశారు. డాక్టర్ శంకర్‌శర్మ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొ నడం ద్వారా చెడు వ్యసనాలకు దూరం కావడంతోపాటు ఆరో గ్యంగా ఉంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో రాణించాలన్నారు.

ఉషూ పోటీల్లో కర్నూలుకు ప్రథమ స్థానం :జిల్లా ఉషూ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఉషూ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీలో కర్నూలు జిల్లా క్రీడాకారులు అన్ని కేటగిరీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే గుంటూరు ద్వితీయ స్థానం, ఈస్ట్ గోదావరి తృతీయ స్థానం, విశాఖపట్నం నాలుగో స్థానాల్లో నిలిచారు. విజేతలకు డా.బి.శంకర్ శర్మ బహుమతులు ప్రదానం చేశారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కోడుమూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాల స్థానంలో కొత్త చట్టాలను తీసుకవచ్చి వారి పొట్టకొట్టేందుకు ప్రయత్నిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, చేనేత సంఘాల నాయకులు రాజు, గఫూర్‌మియా, మాధవస్వామి, కె.రాజు, చిన్నరాముడు, వీరన్న, లక్ష్మన్న, గడ్డం నాగరాజు, కుమార్ పాల్గొన్నారు.

రేపు నెట్‌బాల్ ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక సిల్వర్ జూబ్లీ కళాశాల మైదానంలో ఈనెల 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఉమ్మడి కర్నూలు జిల్లా స్థాయి నెట్‌బాల్ సబ్ జూనియర్ బాలబాలికల ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా నెట్‌బాల్ సంఘం ఫౌండర్ కే.నాగరత్నమయ్య బుధవారం తెలిపారు. 2009 జనవరి తర్వాత జన్మించిన క్రీడాకారుల ంతా ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు అన్నారు. ఎంపికైన క్రీడాకా రులు 18వ తేదీ ఉదయం 9 గంటలకు స్థానిక అవుట్‌డోర్ స్టేడియంలో రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల సెలక్షన్స్ ట్రయల్స్‌లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన ఏపీ సబ్ జూనియర్ బాలబాలికల జట్టు ఈనెల 25 నుంచి 30 వరకు ఇండోర్‌లో జరగనున్న సబ్ జూని యర్ నెట్‌బాల్ నేషనల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొంటారని, వివరాల కోసం 9393855460ను సంప్రదించాలని సూచించారు.

ఆటోల బంద్‌ను జయప్రదం చేయండి

కర్నూలు న్యూసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా జరిగే ఆటోల బంద్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర నాయకురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక చిన్నపార్కు ఆటో స్టాండ్ వద్ద కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. నిర్మల మాట్లాడుతూ దేశంలో రవాణా రంగంలో భాగమైన ఆటో, టాక్సీ, లారీ, ప్రైవేట్ స్కూల్ బస్, ఆర్టీసీ ఇలా అనేక రంగాలు తీవ్ర సంక్షోభంలోకి రావడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలే కారణమన్నారు. నగర ఉపాధ్యక్షుడు ఎం.రాజశేఖర్, విజయ రామాంజనేయులు, మహ్మద్ పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలి

కర్నూలు న్యూసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): పాతబస్తీలో ఉన్న గడియా రం ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించాలని సీపీఎం నగర కార్యదర్శి రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గడియారం ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ బుధవారం ఆసుపత్రి ఎదుట సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. రాజశేఖర్ మాట్లాడుతూ 100 సంవత్సరాలు పైగా చరిత్ర కలిగిన గడియారం ఆసుపత్రి అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. కార్యక్రమంలో కార్యదర్శివర్గసభ్యులు ఎస్ఎండీ షరీఫ్, మహబూబ్‌బాషా, షాషావలి, నూర్ అహ్మద్, శేఖర్ పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు భద్రత కల్పించాలి

కర్నూలు న్యూసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): చిరు వ్యాపారులకు భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప డిమాండ్ చేశారు. బుధవారం ఏఐటీయూసీ కార్యాలయంలో చిరు వ్యాపారులతో సమావేశం జరిగింది. మునెప్ప మాట్లాడుతూ వందల మంది పేదలు రోడ్డు సైడు చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారనీ, వారి సమస్యలు పరిష్కరిం చడంలోనూ నగర పాలక సంస్థ అధికారులు చొరవ చూపాలని కోరారు. సమావేశంలో నాయకులు నల్లన్న, బతుకన్న, సురేష్, వ్యాపారులు, మహిళలు పాల్గొన్నారు.

సీనియర్ అసిస్టెంట్ మృతి

కల్లూరు, మే 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంటుగా పని చేస్తున్న వీవీ.శశిధర్ (46) బుధవారం మృతి చెందాడు. గత కొంత కాలంగా లివర్ సమస్యతో బాధపడుతున్న ఆయన కర్నూలులోని హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కర్నూలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు తెలిపారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కర్నూలు జిల్లా రిజిస్ట్రార్, కల్లూరు, కర్నూలు సబ్ రిజిస్టర్లు, సిబ్బంది ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.



సీఎం పర్యటనను విజయవంతం చేద్దాం

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈనెల 17న పాణ్యం నియోజకవర్గానికి విచ్చేయనున్న సీఎం చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేద్దామని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం మాధవీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ 16వార్డుల ఇన్‌చార్జిలు, క్లస్టర్ ఇన్‌చార్జిలతో గౌరు చరిత సమావేశమయ్యారు. శనివారం సీఎం చంద్రబాబు స్వచ్ఛంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సి.క్యాంపు రైతుబజార్ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. అనంతరం 20వ వార్డు పరిధిలోని కేంద్రీ విద్యాలయ సమీపంలో ఏర్పాటు చేయనున్న ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు. పాణ్యం నియోజకవర్గంలోని ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల, కల్లూరు రూరల్, అర్బన్ వార్డుల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున హాజరు కావాలని ఆమె పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.పార్వతమ్మ, పెరుగు పురుషోత్తంరెడ్డి, ప్రభాకర్ యాదవ్, ఎస్వీ రామకృష్ణ, శైలజా యాదవ్, బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పీయూ మాదన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరిత

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమి పూజ 19వ వార్డు నజర్ కాలనీలో అభివృద్ధి పనులకు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత భూమి పూజ చేశారు. బుధవారం కార్పొరేషన్ కమిషనర్ రవీంద్రబాబుతో కలిసి ఎమ్మెల్యే రూ.91.45 లక్షలతో డ్రైనేజీలు, డబ్ల్యూబీఎం రోడ్ల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో కల్లూరు అర్బన్ వార్డుల కన్వీనర్ పెరు గు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, పాణ్యం వాణిజ్య విభాగం అధ్యక్షుడు బ్రాహ్మణపల్లె నాగిరెడ్డి, పల్లె రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై కళా బృందాలతో అవగాహన

అదనపు డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్

కర్నూలు హాస్పిటల్, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్యఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కోసం ఏర్పాటు చేసిన కళాజాతాను అదనపు డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు. బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అదనపు డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో ఎంపిక చేసిన హెచ్‌ఐవీ ప్రభావిత ప్రాంతాల్లో 20 చోట్ల ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు హెచ్‌ఐవీపై ఉన్న అపోహలను, చికిత్స విధానాన్ని వివరించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న ఎన్‌జీవోలు, ఆరోగ్య సిబ్బంది, డీఆర్‌డీఏ, డీడబ్ల్యూఎంఏ, ఐసీడీఎస్ శాఖలతో సమన్వయం చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, నేస్తం పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు సుధారాణి, నాగరాజు,


కళాజాతాను ప్రారంభిస్తున్న అదనపు డీఎంహెచ్‌వో ఎల్.భాస్కర్

లింకు వర్కర్ స్కీం డీఆర్‌పీ నాగరాజు, ఎస్ఆర్ఈడీ, వీఎంఎం సంస్థల ప్రాజెక్టు మేనేజర్లు మునీర్, విజయ పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


చనుగొండ్లలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న డీపీవో భాస్కర్

గూడూరు మే 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డెంగీ, మలేరియా వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీపీవో భాస్కర్ అధికారులను ఆదేశించారు. బుధవారం గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలో ఆయన పర్యటించారు. కొద్ది రోజుల క్రితం ఓ చిన్నారి డెంగీ వ్యాధి పడి కోలుకోగా.. ఆ చిన్నారిని ఆయన పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ చనుగొండ్లలో ఎక్కడా అపరిశుభ్రత నెలకొనకుండా పారిశుధ్య పనులను చేపట్టాలని, తాగునీటి సరఫరా లీకేజీలు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయన వెంట ఈవోఆర్‌డీ మధులత, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ ఉన్నారు.

బుధ, శనివారాల్లో వ్యాధి నిరోధక టీకాలు

కర్నూలు హాస్పిటల్, మే 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రతి బుధ, శనివారాల్లో బీసీజీ పోలియో మెదడు వాపు, మిజిల్స్, హైపటటిస్-బీ, పీసీవీ, ఐపీవీ, డీపీటీ వంటి వ్యాధి నిరో ధక టీకాలు ఉచితంగా లభిస్తాయనీ జిల్లా సంచార చికిత్స కార్యక్రమం అధికారి డాక్టర్ రఘు తెలిపారు. బుధవారం కల్లూరు మండలంలోని పెద్దటేకూరు సచివాలయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. వైద్యాధికారి కృష్ణబాయి, క్షేత్రస్థాయి పర్యవేక్షకులు మద్దమ్మ, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ

కర్నూలు స్పోర్ట్స్, మే 14 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లాలో ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు జరగబోయే రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే కర్నూలు జిల్లా క్రీడాకారులకు బుధవారం స్థానిక బాస్కెట్‌బాల్ క్రీడా మైదానంలో బీఎస్ఎన్ఎల్ హేమంత్ కుమార్ క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు ముస్తహీర్, దాదా బాషా పాల్గొన్నారు.

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రీహరి



కర్నూలు లీగల్, మే 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది వై.శ్రీహరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బుధవా రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమో దైన కేసులను ప్రాసిక్యూషన్ తరపున నిర్వహించడమే కాకుండా ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా బాధ్యతలను నిర్వహిస్తారు. ఈయన 2006లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంటు చేసు కుని ప్రాక్టీసును ప్రారంభించి సివిల్ క్రిమినల్ కేసులలో అనుభవాన్ని గడించారు. ఈయన నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.

మన మిత్ర సేవలను వినియోగించుకోవాలి

కర్నూలు న్యూసిటీ, మే 14(ఆంధ్రజ్యోతి): మన మిత్ర సేవలను నగర పౌరులు వినియోగించుకోవాలని కార్పొరేషన్ మేనేజర్ చిన్నరాముడు సూచించారు. బుధవార కార్పొరేషన్ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి మన మిత్ర బ్యానర్ బోర్డులను ఆయన అందజేశారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు సులువుగా అందించేందుకు రాష్ట్ర ప్రభు త్వం మన మిత్ర పేరుతో వాట్సాప్ గవర్నెన్స్ తీసుకువచ్చిందన్నారు. వాట్సాప్ 9552300009 నెంబర్ ద్వారా వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు, పన్ను చెల్లింపులు తదితర సేవలను పౌరులకు కల్పించేందుకు ప్రతి సచివాలయ వద్ద బ్యానర్ బోర్డులను ఏర్పాటు చేశామని మేనేజర్ వెల్లడించారు.

క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు

కర్నూలు స్పోర్ట్స్, మే 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే మంచి గుర్తింపు ఉంటుందని కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ అండ్ ఫార్మా కాలేజీ చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కొండారెడ్డి బురుజు వద్ద ఓపెన్ థియేటర్ షాపింగ్ కాంప్లెక్స్ సమీపంలో తైక్వాండో శిక్షణా శిబిరంలో శిక్షణ పొందతున్న విద్యార్థులకు కేవీ సుబ్బారెడ్డి పౌష్టికాహారం అందజేశారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి తైక్వాండో శిక్షణా శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం కేవీ సుబ్బారెడ్డిని శాలువతో సన్మానించారు. క్యాంప్ ఇన్‌చార్జి టి.అజయ్, మల్లికార్జున, భార్గవ్, లలిత, శివమణి, తిలక్, అఖిల్, సాయి కృష్ణ, హరి పాల్గొన్నారు.

మట్కాబీటర్ల అరెస్టు

కర్నూలు క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి): వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇద్దరు మట్కాబీటర్లపై కేసు నమోదైంది. ఫయాజ్, అబ్దుల్లా అనే ఇద్దరు పాతబస్తీలో మట్కా చీటిలు రాస్తుండగా.. పోలీసులు వారిని అదుపులో తీసుకున్నారు. వీరి వద్ద నుంచి మట్కా చీటిలు రూ.5,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సమావేశానికి తరలిరండి

ఓర్వకల్లు, మే 14(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 17న స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర పర్యటనలో భాగంగా పాణ్యం నియోజకవర్గంలోని కల్లూరు అర్బన్‌కు విచ్చేస్తున్న సందర్భంగా గురువారం ఓర్వకల్లులోని జీవేశ్వరస్వామి కల్యాణ మండపంలో జరిగే సమావేశానికి భారీగా ప్రజలు, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు తరలిరావాలని టీడీపీ మండల కన్వీనర్ గోవిం దరెడ్డి బుధవారం కోరారు. ఈ సమావేశానికి పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి హాజరవుతున్నారన్నారు.

టీజీ వెంకటేశ్‌ను కలిసిన జనసేన నేత లక్ష్మన్న

కర్నూలు కల్చరల్, మే 14(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్‌ను జనసేన పార్టీ మంత్రాలయం నియోజకవర్గం ఇన్‌చార్జి బి.లక్ష్మన్న బుధవారం బుధవారం టీజీ స్వగృహంలో కలిసి సత్కరిం చారు. లక్ష్మన్న మాట్లాడుతూ టీజీ వెంకటేశ్ ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని, ఆయన దగ్గరికే పదవులు వెతుక్కుంటూ వచ్చాయ న్నారు. ఆయన భవిషత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బీవీ రవిచంద్ర, బీవీ రాజేష్, వరప్రసాద్, రాఘవేంద్ర, రఘు పాల్గొన్నారు.


టీజీ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న లక్ష్మన్న

ఘనంగా ఛత్రపతి శంభాజీ జయంతి

కర్నూలు అర్బన్, మే 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని బిర్లా కాంపౌండ్‌లోని బీసీ ఆర్‌పీఎస్ కార్యాలయంలో బుధవారం ఛత్రపతి శంభాజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బీసీ రిజర్వేషన్ పోరాట సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి బత్తుల లక్ష్మీకాంతయ్య పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈసందర్భంగా లక్ష్మీకాంతయ్య మాట్లాడుతూ ఛత్రపతి శంభాజీ ధర్మం వీడని పరాక్రమవంతుడని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవ పూజ ధనుంజయ్ ఆచారి, వాల్మీకి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సురేష్ పాల్గొన్నారు.

కౌలుకార్డు తప్పనిసరి: ఏవో

సి.బెళగల్, మే 14(ఆంధ్రజ్యోతి): కౌలుకార్డులు తప్పనిసరిగా కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ కౌలు రైతు లకు సూచించారు. బుధవారం కొత్తకోట గ్రామంలో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ పొలాలను కౌలుకు తీసుకున్న ప్రతి రైతు కౌలు కార్డులకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కౌలు కార్డులు లేకుంటే ప్రభుత్వ పథకాలు వర్తించవని అన్నారు. ఈసమావేశంలో ఎంపీఈవోలు, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి

సి.బెళగల్, మే 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీల పెంచాలని ఎంపీ డీవో రాణెమ్మ సిబ్బందికి సూచించారు. బుధవారం సి.బెళగల్, పోలకల్లు గ్రామాల్లో ఆమె ఉపాధి పనులను తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని జాబు కార్డు ఉన్నవారంతా ఉపాధి పనులను ఉపయోగించుకోవాలన్నారు. ఎంపీడీవో వెంట ఏపీవో రామన్న, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

ఉమెన్స్ ఫుట్‌బాల్‌కు ఇద్దరి ఎంపిక

కర్నూలు స్పోర్ట్స్, మే 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బీ.క్యాంపులోని ప్రభుత్వ మెన్ డిగ్రీ కాలేజీలో లక్ష్య క్రీడాకారుల సెంటర్‌లో ప్రతినిత్యం ఫుట్‌బాల్ తర్ఫీదు పొందుతున్న క్లస్టర్ యూనివర్సిటీ విద్యార్థినులు బి.భువనేశ్వరి, జే.అనితలు ఈ నెల 15వ తేదీ నుంచి 22వ తేదీ వరకు నిజామాబాదులో జరగబోయే తెలంగాణ ఉమెన్స్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలకు ఎంపికయ్యారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా.కే.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ పీడీ వై.శ్రీనివాసరెడ్డి, లక్ష్య ఫుట్‌బాల్ కోచ్ కే.బ్రహ్మకుమార్ పాల్గొన్నారు.

పరిశ్రమపై ప్రజాభిప్రాయ సేకరణ

కర్నూలు రూరల్ మే 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు మండలం గొందిపర్ల గ్రామ పరిధిలో ఉన్న శ్రీరాయలసీమ ఆల్కాలీస్ పరిశ్రమ విస్తరణపై బుధవారం ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈకార్యక్రమానికి కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి సందీప్‌కుమార్, తహసీల్దార్ వెంకట రమేష్‌బాబు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు టెక్నికల్ ఇంజనీర్ శంకర్‌నాయక్ హాజరయ్యారు. ఆల్కాలీస్ పరిశ్రమ పరిసర ప్రాంతంలో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం చేపట్టారు. కార్యక్ర మానికి పంచలింగాల, ఈ.తాండ్ర పాడు, గొందిపర్ల, దేవమాడ గ్రామాల ప్రజలు హాజరయ్యారు. అందులో మూడు వందల మంది ప్రజలు పరిశ్రమ ఏర్పాటు చేయాలని అనూకులంగా అధికారులకు రాతపూర్వ కంగా అర్జీలు ఇచ్చారు. వారిలో 20శాతం వరకు ప్రజలు పరిశ్రమ విస్తరణకు వ్యతిరేకంగా అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ వివరించారు. పంచలింగాల, ఈ.తాండ్ర పాడు, గొందిపర్ల, దేవమాడ గ్రామ పంచా యతీ సర్పంచులు గొల్లకృష్ణ, బాలపీరా (సీపీఎం), బోయ శ్రీనివాసులు, ఈశ్వరయ్యలతోపాటు ఎంపీటీసీ సభ్యులు పరిశ్రమలు విస్తరించడం వలన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులకు తెలియజేశారు. పరిశ్రమ మరింత విస్తరించడం వలన గ్రామంలో యువకులకు ఉపాధి, ఉద్యోగావకాశాలు పెరుగుతాయని సర్పంచులు వారి మనోభావాలను వెల్లడించారు.

పరిశ్రమను నిలిపివేయాలి

కర్నూలు న్యూసిటీ: జిల్లాలో నూతనంగా ఏర్పాటు అవుతున్న పరిశ్రమ వృత్తిదారులకు హాని కలిగించే విధంగా ఉందని, దానిని తక్షణమే నిలిపివేయాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ అన్నారు. బుధవారం ప్రజాఅభిప్రాయం సేకరణలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. గురుశేఖర్ మాట్లాడుతూ పది గ్రామాల్లో చేతివృత్తులపై ఆధారపడి జీవించే మత్స్యకారులు, రజకులు, గొర్రెల పెంపక దారులకు ఈ ఫ్యాక్టరీ కెమికల్ హాని కలిగించే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ ఆనంద్‌బాబు, సీఐటీయూ న్యూసిటీ అధ్యక్షుడు నరసింహులు, మండల కన్వీనర్ అయ్యన్న పాల్గొన్నారు.

పద్మ విభూషణ్ డా.నాగేశ్వరరెడ్డికి ఆహ్వానం

కర్నూలు హాస్పిటల్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 18వ తేదీ సాయంత్రం కర్నూలు ఐఎంఏ భవన్‌లో జరిగే విద్యా విజ్ఞాన సదస్సుకు హాజరు కావాలని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ (ఏఐజీ) హాస్పిటల్స్ చైర్మన్, పద్మవిభూషణ్ డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డిని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డా.బి.శంకర్‌శర్మ కర్నూలు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి డా.జి.మోహన్‌రెడ్డి ఆహ్వానించారు. బుధవారం సాయంత్రం హైదరాబాదులో డి.నాగేశ్వరరెడ్డిని వారు కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల పద్మవిభూషణ్‌ను అందుకున్న డా. నాగేశ్వరరెడ్డిని సన్మానించారు. అనంతరం ప్రేగుల ఆరోగ్యంపై డా.నాగేశ్వరరెడ్డి ఉపన్యాసం ఉంటుందన్నారు.


డాక్టర్ నాగేశ్వరరెడ్డిని సన్మానిస్తున్న డాక్టర్లు శంకర్‌శర్మ, మోహన్ రెడ్డి

బంగారు పుస్తెలు, పట్టు వస్త్రాలు పంపిణీ


బంగారు పుస్తెలు, పట్టు వస్త్రాలు పంపిణీ చేస్తున్న టీజీ కుటుంబ సభ్యులు

కర్నూలు కల్చరల్, మే 14(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఈనెల 16న వివాహం చేసుకుంటున్న జంటలకు బుధవారం టీజీ వెంకటేశ్ స్వగృహంలో పట్టు వస్త్రాలు, కాలి మెట్టెలు, బంగారు తాళిబొట్లు పంపిణీ చేశారు. హిందూ, ముస్లిం, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం 75 జంటలు మే 16న వివాహంతో ఒక్కటి కానున్నారు. ఈ సందర్భంగా వీరికి టీజీ వెంకటేశ్ సతీమణి టీజీ రాజ్యలక్ష్మి, మంత్రి టీజీ భరత్ సతీమణి టీజీ శిల్పాభరత్, మౌర్యలు ఈ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులకు పట్టు వస్త్రాలు పంపిణీ చేశారు.

ఆరోపణలు అవాస్తవం: సీఐ

కర్నూలు క్రైం, మే 14(ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ గ్రామానికి చెందిన రైతు నాగన్న, ఆయన భార్య పోలీసులపై చేసిన ఆరోపణలు అవాస్తవ వమని కర్నూలు రూరల్ సీఐ చంద్రబాబు నాయుడు తెలిపారు. బుధవారం పత్రికల్లో వచ్చిన వార్తలపై ఆయన స్పందించారు. నాగన్న ఉన్న తాధికారులకు పెట్టుకున్న పిటీషన్‌ను విచారించేందుకు మాత్రమే వారిని స్టేషన్‌కు పిలిపించామన్నారు. వారి పొలం పంచాయితీలో మేము ఎటువంటి జోక్యం చేసుకోలేదన్నారు. గతంలో పొలం విషయంలో ఎప్పుడు కూడా పోలీస్ స్టేషన్‌కు కానీ, సర్కిల్ ఆఫీసుకు కానీ పిలిపించలేదన్నారు వారిపై గతంలోనే 2024 ఫిబ్రవరి నెలలో నాగన్న, ఆయన పెద్ద కుమారుడు సంజీవలపై రౌడీషీట్స్ ఓపెన్ చేశామని చెప్పారు. రౌడీ షీట్స్ ఓపెన్ చేసిన తర్వాత కూడా వాళ్లు మళ్లీ గత ఏడాది దసరా పండుగ సందర్భంలో గ్రామంలో రాజు అనే వ్యక్తికి, నాగన్న కుటుంబానికి మధ్య గొడవలు జరిగాయని, ఇరువర్గాలపై కేసులు నమోదు చేశామని తెలిపారు. రాజు తీవ్రంగా గాయపడటంతో నాగన్న, ఆయన పెద్ద కొడుకును రిమాండ్‌కు పంపించామన్నారు. చిన్న పిల్లలపై ఎలాంటి రౌడీషీట్స్ ఓపెన్ చేయలేదని తెలిపారు. అలాగే వారిని జైలుకు పంపాము అనే మాటలు కూడా అవాస్తవమన్నారు. వారికి నోటీసులు ఇచ్చి మాత్రమే పంపించామని, సివిల్ పంచాయితీలో పోలీసులు ఎలాంటి జోక్యం చేసుకోలేదని, వారిని స్టేషన్‌కు పిలిచి తిట్టామని, కొట్టామని చేసే ఆరోపణలు అవాస్తవమని ఆయన తెలిపారు.

కేఎంసీ క్యాంటీన్ సమస్యను పరిష్కరించండి

కర్నూలు హాస్పిటల్, మే 14 (ఆంధ్రజ్యోతి): కేఎంసీ క్యాంటీన్ సమస్యను వెంటనే పరిష్కరించాలని కర్నూలు జీజీహెచ్ అభివృద్ధి కమిటీ సభ్యుడు పీటీ సాయిప్రదీప్ ప్రిన్సిపాల్ డా.కే. చిట్టినరసమ్మకు వినతి పత్రం సమర్పించారు. కర్నూలు జీజీహెచ్‌కు ఏడు జిల్లాల నుంచి రోగులు 3వేల మంది వస్తుంటారని, అలాంటి హాస్పిటల్‌లో క్యాంటీన్ వివాదం నడుస్తుందని, దీని వల్ల డాక్టర్లు, రోగులు, వారి సహాయకులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారనీ ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లాల న్నారు. ప్రిన్సిపల్ వెంటనే జోక్యం చేసుకుని కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్, పోలీసు శాఖ వారితో సమన్వయ కమిటీని ఏర్పాటు చేసి క్యాంటీన్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

మైనార్టీలకు సబ్సిడీ రుణాలు

ఆదోని టౌన్, మే14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని క్రిస్టియన్, ముస్లిం జైన్లు, సిక్కు మైనార్టీలకు సబ్సిడీ రుణాలు ఇవ్వనున్నట్లు మెప్మా అధికారులు బుధవారం తెలిపారు. పట్టణ పరిధిలో 29 యూనిట్లు ఉన్నాయని స్వయం ఉపాధికి ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. తెల్ల రేషన్ కార్డుగా మైనార్టీలు ఈ నెల 25లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



మాట్లాడుతున్న నాయకుడు యూసుఫ్

దేవనకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లు కార్మికుల పాలిట శాపంగా మారాయని, వాటిని రద్దు చేయాలని సీఐటీయూ, ఏఐటీయుసీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సమావేశంలో సీఐటీయూ ఉపాధ్యక్షుడు యూసుఫ్, ఏఐటీయూసీ నాయకుడు నర్సారావ్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్‌కు వంత పాడుతూ కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. వీటితో కార్మికులకు కనీస వేతన కుడా అందని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెను కార్మికులు జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో ఆశోక్, వెంకటేష్, మాబాషా రవికుమార్, ఆటో మల్లి, రాజశేకర్, శ్రీనివాసులు, శేకర్ పాల్గొన్నారు.

క్షుద్రపూజల కలకలం



క్షుద్రపూజలు చేసిన ప్రాంతం

వెల్దుర్తి, మే 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం క్షుద్రపూజల కలకలం చోటుచేసుకుంది. జాతీయరహదారి-44 సమీపంలోని ఓ ఇంటిలో గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం సాయంత్రం క్షుద్రపూజలు చేసినట్లు ఫోటోలు, వీడియోలు సోషల్ మీడియాలో హల్‌చల్ చేశాయి. పోలీసులు విచారణ చేసి క్షుద్ర పూజలు చేసిన వారిని సహకరించినవారిని అదుపులోకి తీసుకుని ప్రకారం చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

కంటి వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి



జొన్నగిరిలో కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

తుగ్గలి, మే 14 (ఆంధ్రజ్యోతి): కంటి వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులు డా.చంద్రశేఖర్ సూచించారు. బుధవారం జొన్నగిరి పంచాయతీ కార్యాలయంలో సుశీల నేత్రాలయ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్యాంబాబు సూచనల మేరకు ఉచిత వైద్యశిబిరాన్ని సర్పంచ్ ఓబులేసు, మాజీ ఎంపీపీ గుర్రుస్వామి, టీడీపీ నాయకులు బాలన్న, తిరుపాల్ నాయుడు, లక్ష్మణస్వామిలు ప్రారంభించారు. దాదాపు 100 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారిని కర్నూలుకు రెఫర్ చేశారు. మాజీ వైస్ ఎంపీపీ చంద్రశేఖర్ యాదవ్, సంగాల కృష్ణ, జయచంద్ర ఉన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మద్దికెర, మే 14 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు పౌష్టికాహారం తీసుకుంటునే ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ వైద్యాధికారి శ్రీలక్ష్మి సూచించారు. బుధవారం వైద్యశాలలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రతి బుధవారం వైద్యశాలలో గర్భిణులకు వైద్యపరీక్షలు చేశారు. ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవడం వల్ల రక్తం పెరుగుతుందన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో ప్రసవం చేయించుకుంటే తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీలు అవగాహన కల్పించి వైద్యశాలకు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ అక్బర్‌బాషా ఉన్నారు.

దేవుడు ఒక్కడే



మాట్లాడుతున్న శివసాయి స్వామి

మద్దికెర, మే 14 (ఆంధ్రజ్యోతి): మతాలు, ప్రాంతాలు వేరయినా దేవుడు ఒక్కడేనని ఓర్వకల్లు మండలం కాల్వబుగ్గ శివసాయి పీఠాధిపతి శివసాయిబాబా స్వామీ కాలజ్ఞాన వీరబ్రహ్మేంద్ర స్వామి ముని మనుమడు వీరభట్లయ్య స్వామి అన్నారు. బుధవారం మద్దమ్మకుంట సమీపాన వెలసిన మాధవీదేవీ ఆలయంలో ఈశ్వరయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి శివసాయిబాబా స్వామీ ఇద్దరూ ఒక్కటేనన్నారు. హిందువులు ఐకమత్యంతో ముందుకు వెళ్లాలని తెలిపారు. అనంతరం మాధవీ దేవతను దర్శించుకుని ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. నిర్వాహకులు సన్మానించి, తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు కాయగూరల శ్రీనివాసులు, నెట్టికంటయ్య, రామాంజులు, సూరి ఉన్నారు.

పండ్ల మొక్కలకు వంద శాతం రాయితీ

ఆస్పరి, మే14 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల అభివృద్ధిలో భాగంగా ప్రభుత్వం వందశాతం సబ్సిడీతో పండ్ల తోటల మొక్కలను పంపిణీ చేస్తుందని ఎంపీడీవో గీతావాణి తెలిపారు. బుధవారం ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, మేటీలు, టెక్నికల్ అసిస్టెంట్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లు రైతులకు అవగామన కల్పించాలని కోరారు. సమావేశంలో ఏపీవో రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో గీతావాణి

ఉపాధిలో పెరిగిన కూలి

- హర్షం వ్యక్తం చేస్తున్న కూలీలు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు(ఫైల్)

ఆలూరు, మే 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులకు రోజు ఇచ్చే వేతనాలు కేంద్ర ప్రభుత్వం స్వల్పంగా పెంచింది. వేసవిలో ప్రత్యేక భత్యం ఇవ్వనందున ఆ లోటును భర్తీ చేసేందుకు దినసరి కూలీని రూ.300ల నుంచి రూ.307లు పెంచింది. ఈ పెంపును గత నెల నుంచి అమలులోకి వస్తుందని అధికారులు తెలిపారు. మండలంలోని 16 పంచాయతీల్లో 10వేల జాబ్‌కార్డులు ఉండగా, ఉపాధి పనులకు 3,070 మంది వస్తున్నారు. మూడేళ్ల క్రితం ఫిబ్రవరి నుంచి జూన్ వరకు వేసవి భత్యం కింద కూలీలకు 15 శాతం నుంచి 30 శాతం వరకు అదనంగా ఇచ్చేవారు. దీనికోసం పనుల కోసం తీసుకు వెళ్లే పరికరాల కోసం, తాగునీరు, మజ్జిగకు సంబంధించి అదనపు భత్యం ఉండేది. అయితే ఇప్పుడు భత్యం ఇవ్వడం లేదు, కూలిని స్వల్పంగా పెంచారు.

కొలత ప్రకారం వేతనం



ఉపాధి కూలీలకు కొలతలు ప్రకారం వేతనం వస్తుంది. వీరికి వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేసవి దృష్ట్యా కూలీలు వడదెబ్బకు గురికాకుండా రెండు పూటలా పనులు కల్పిస్తున్నాం. **- శ్రీనివాసులు, ఏపీవో, ఆలూరు.**

సాదాసీదాగా మండల సమావేశం

- కుక్కల బెడద, విద్యుత్ కోతలపై సభ్యుల ఫిర్యాదు



మాట్లాడుతున్న ఎంపీపీ దేశాయి లక్ష్మీదేవి

వెల్దుర్తి, మే 14(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. బుధవారం ఎంపీపీ దేశాయి లక్ష్మీదేవి అధ్యక్షతన ఎంపీడీవో సుహాసినమ్మ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. దేశ సేవలో వీరమరణం పొందిన మురళీనాయక్ చిత్రపటానికి నివాళి అర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. మూడు నెలల్లో చేసిన అభివృద్ధి, ఇకముందు చేయనున్న అభివృద్ధి పనుల గురించి వివరించారు. అధికారులు తమ ప్రభుత్వ పథకాలు, పనితీరు, అమలుపై నివేదికలను సభ్యులకు తెలియజేశారు. అనంతరం సభ్యులు మాట్లాడుతూ వెల్దుర్తిలో కుక్కల బెడద అధికంగా ఉందని చిన్నపిల్లలు, వృద్ధులు, పాదాచారుపై అవి దాడులు చేస్తున్నాయని, నివారించాలని డిప్యూటీ ఎంపీడీవో రవికిశోర్ దృష్టికి తీసుకొచ్చారు. విద్యుత్ కోతలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని కోతలు లేకుండా చూడాలని విద్యుత్ అధికారికి తెలియజేశారు. బాల్యవివాహాలను అరికట్టడానికి ప్రజలకు అవగాహన కల్పించాలని ఐసీడీఎస్ అధికారి తెలిపారు. వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ రైతులు యూనిక్ ఐడీ తీసుకోవాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ కౌలు రైతులకు కార్డులు జారీచేస్తున్నామని తెలియజేశారు. సచివాలయ ఉద్యోగులు సర్వేలు పూర్తిచేయాలని ఎంపీడీవో తెలిపారు. జడ్పీటీసీ సుంకన్న, తహసీల్దార్ చంద్రశేఖరవర్మ, ఏవో అక్బర్‌బాషా, పశువైద్యాధికారి స్వాతి, ఏపీవో లక్ష్మన్న, ఏపీఎం అనురాధ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మునెయ్య, హౌసింగ్ అధికారి బాలకృష్ణ, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నాసిరకంగా నిర్మాణ పనులు

ఆదోని టౌన్, మే14 (ఆంధ్రజ్యోతి): ఆదోని రైల్వే స్టేషన్‌లో అమృత్ పథకం కింద చేస్తున్న ఆధునికీకరణ పనులు నాసిరకంగా ఉన్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. బుధవారం పనులను పర్యవేక్షించారు. రైల్వే ఇంజనీర్లు, కాంట్రాక్టర్లకు వత్తాసు పలుకుతున్నారని, దీంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారన్నారు. ఇటుకలు ఫ్లై యాష్ బూడిద కలుపుతున్న కారణంగా దృఢంగా లేవన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. నాగరాజు గౌడ్, మరియాని చెన్న బసప్ప, నాగార్జున, మహాదేవ, సన్నప్ప కిరణ్, యువరాజ్ పాల్గొన్నారు.



గోడను పరిశీలిస్తున్న నాయకులు

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని, మే14 (ఆంధ్రజ్యోతి): పెద్దకడుబురు మండలం బసలదొడ్డి గ్రామానికి చెందిన నాగరా జును అదుపులోకి తీసుకుని, కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సైదుల్లా బుధవారం తెలిపారు. సమాచారం మేరకు పెద్దతుం బళం గ్రామ శివారులో నింది తుడిని అరెస్ట్ చేసి, ఎనిమిది కర్ణాటక మద్యం బాక్సులు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నా మని తెలిపారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మద్యం, బైక్‌ను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

19న ఉపసర్పంచ్ ఎన్నిక

మద్దికెర, మే 14 (ఆంధ్రజ్యోతి): మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఈ నెల 19న నిర్వహించనున్నట్లు డిప్యూటీ ఎంపీడీవో శివకుమార్ తెలిపారు. బుధవారం సభ్యులకు ఫారం-2 నోటీసులను అందజేశారు. మొత్తం 18 సభ్యులు ఉండగా మెజారిటీ సభ్యులు వైసీపీ మద్దతుదారులే ఉన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

పత్తికొండ టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 15 నుంచి 18 వరకు తిరుపతి పట్టణంలో నిర్వహించన్ను ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా ఉపాధ్యక్షుడు హనుమేష్ పిలుపునిచ్చారు. బుధవారం పత్తికొండ నుంచి 30 మంది తిరుపతికి బయలుదేరి వెళ్లారు. నాలుగు రోజుల పాటు జరిగే మహాసభల్లో నిరుద్యోగం, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలపై చర్చిస్తారన్నారు.

సమస్యలను వేగంగా పరిష్కరించాలి

దేవనకొండ, మే 14 (ఆంధ్రజ్యోతి): సచివాలయానికి వచ్చిన ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించాలని పత్తికొండ డీఎల్‌డీవో పి.అను రాధ ఆదేశించారు. బుధవారం దేవనకొండ సచివాలయాన్ని తనిఖీ చేశారు వాట్సప్ సేవలను ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతూ గ్రామాల్లో నిర్దేశించిన సమయంలోపు సర్వేలు పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో బీవీ రమణరావు, ఇన్‌చార్జి డీప్యూటి ఎంపీడీవో రఫి, అసిస్టెంట్ నాగమ్మ ఉన్నారు.



రిజిస్టర్ పరిశీలిస్తున్న డీఎల్‌డీవో

టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి

ఆలూరు, మే 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఆలూరు ఇన్‌చార్జి వీరభద్రగౌడ్ అన్నారు. బుధవారం మండలలోని మూసానహళ్లి గ్రామంలో పర్యటించారు. సమస్యలు తెలుసుకున్నారు. కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేయాలని, ఇల్లు లేని వారు గృహాలు నిర్మించుకోవాలన్నారు. అనంతరం మహాయోగి లకమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. నాయకులు కొమ్ము రాజు, వన్నూరువలి, గోపాల్, నారాయణ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న వీరభద్రగౌడ్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మద్దికెర, మే 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉరుములు, మెరుపులతో వర్షం కురిసి, పిడుగులు పడే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హుసేన్ సాహెబ్ సూచించారు. బుధ వారం వీఆర్వోల సమావేశంలో మాట్లా డుతూ గ్రామాల్లో ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఉరుములు, మెరుపులతో వర్షం కురిసే సమయంలో ప్రజలు చెట్లు, సెల్ టవర్ల వద్ద ఉండకూడదని తెలిపారు. వర్షం వచ్చే సూచనలు ఉంటే బయటకు వెళ్లవద్ద న్నారు. అత్యవసరమైతే తగిన జాగ్రత్త లు తీసుకుని వెళ్లాలని సూచించారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు

తుగ్గలి, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల యజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తప్పవని ఎంఈవో రమావెంకటేశ్ గౌడ్ హెచ్చరించారు. బుధవారం ఎమ్మార్సీ కార్యాలయంలో మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వం నిర్ణయిం చిన ఫీజులను మాత్రమే తీసుకోవాలని, 25 శాతం సీట్లను ఉచితంగా పేద విద్యార్థుల తో భర్తీ చేయాలన్నారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులతోనే బోధన కొనసాగించాలని సూచించారు.

వ్యాపారులకు గుర్తింపు కార్డుల జారీ

ఆదోని టౌన్, మే14 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు, వెండింగ్ సర్టిఫికెట్లను జారీ చేయనున్న ట్లు మునిసిపల్ కమిషనర్ కృష్ణ తెలిపారు. బుధవారం మాట్లాడుతూ, వీధి వ్యాపారులతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా స్మార్ట్ స్ట్రీట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 19వ తేదీలోగా వీధి వ్యాపారులు తమ ప్రాంతానికి చెందిన సచివాలయంలోని సంక్షేమ కార్యదర్శి కలిసి వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

పేదల గృహాలకు భారీ ఊరట

- 60 గజాల్లోపు నిర్మాణాలకు అనుమతి మినహాయింపు



ఆదోని టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): సొంత ఇంటిని నిర్మించుకునే పేదలకు ప్రభుత్వం ప్లాన్ మంజూరు విషయంలో భారీ ఊరట కలిగిస్తూ నోటిఫికేషన్ జారీ చేసింది. 60 చదదరపు గజాలు (50 చదరపు మీటర్లు) స్థలంలో ఇల్లు నిర్మించుకునే వారికి ఇక నుంచి మున్సిపాలిటీ అనుమతి అవసరం లేదు. గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణాలకు అవకాశం కల్పించింది. ఈ మేరకు మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ డిపార్ట్మెంట్ (ఎంఏయూడీ) నోటిఫికేషన్ జారీ చేసింది. దరఖాస్తుదారుడు ఆన్‌లైన్‌లో కేవలం రూపాయి టోకెన్ ఫీజు చెల్లించి, రిజిస్టర్ చేసుకుని స్వీయ ధ్రువీకరణ ద్వారా ఇంటి నిర్మాణం కోసం అనుమతి పొందే అవకాశాన్ని కల్పించారు. ప్రభుత్వ భూములు, నిషేధిత, వివాదాస్పద భూములలో ఈ నిబంధన చెల్లదని ఉత్తర్వులలో పేర్కొన్నారు.

పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వ ప్రోత్సాహం



మాట్లాడుతున్న ఏపీడీ ఫక్కీరప్ప

ఆలూరు రూరల్ , మే14 (ఆంధ్రజ్యోతి): సన్న, చిన్నకారు రైతులు పంట్ల తోటలు పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని ఏపీడీ పక్కిరప్ప, ఎంపీడీవో మద్దిలేటి స్వామి అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఉపాధి కూలీల హాజరు శాతం పెం చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆలూరు మండలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం 24 నీటి తొట్లు మంజూరు చేసిం దన్నారు. ఎండలు విపరీతంగా ఉన్నాయని, ఉపాధి కూలీలు ఉదయమే పనిలోకి వెళ్లాలని కోరారు. అనంతరం ఆలూరు ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన మద్దిలేటి స్వామిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో శ్రీనివాసులు టెక్నికల్ అసిస్టెంట్లు శివప్ప, ఈరన్న, నాగేశ్, రమేష్, గాదెప్ప పాల్గొన్నారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



మాట్లాడుతున్న ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మి

హాలహర్వి, మే 14 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ లక్ష్మి అన్నారు. బుధవారం వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఇచ్చే కౌలు కార్డులద్వారా ప్రయోజనాలు ఉన్నాయని, ప్రభుత్వ పథకాలు లబ్ధి పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని కోరారు. ఏవో శివశంకర్, వీఏవో ఇంద్రజ తదితరులు పాల్గొన్నారు.

కనుమరుగవుతున్న కళలు

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్‌బాబు



మాట్లాడుతున్న నాయకులు

ఆదోని రూరల్/అగ్రికల్చర్, మే 14 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కళలు కనుమరుగవుతున్నాయని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అజయ్‌బాబు అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ నేటి నుంచి ఈనెల 18వ తేది వరకు విశ్వ నారాయణ కాలేజీలో జిల్లా స్థాయి ప్రజానాట్య మండలి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో కళాకారులు వీధుల్లో ప్రదర్శనలు ఇచ్చేవారని, ప్రస్తుతం లేరన్నారు. 50 ఏళ్ల పైబడ్డ కళాకారులకు ప్రభుత్వం పింఛన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి

మద్దికెర, మే 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో రంగ స్వామి కోరారు. బుధవారం మండలంలోని మద్దికెర, హంప గ్రామాల్లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. హంపా గ్రామంలోని పాఠశాలను 7వ తరగతి వరకు ఉన్న ప్రాథమిక పాఠశాలను పదో తరగతికి అప్‌గ్రేడ్ చేశారన్నారు. ఇప్పటికే పుస్తకాలు ఉచ్చాయని, పాఠశాల తెరిచిన వెంటనే విద్యార్థులకు పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను సిద్ధం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎంజీ నాగరాజు, విశ్వనాథ్, తదితరులు ఉన్నారు.



కరపత్రాలు ఇస్తున్న ఎంఈవో

ఉపాధ్యాయ పోస్టుల మంజూరుపై హర్షం



మాట్లాడుతున్న ఎస్టీయూ నాయకుడు సుధాకర్‌బాబు

ఆదోని అగ్రికల్చర్, మే14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక పాఠశాలలకు నూతన ఉపాధ్యాయ పోస్టులు మంజూరు పట్ల ఎస్టీయూ నాయకుడు సుధాకర్ బాబు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం నెహ్రూ ఉన్నత పాఠశాల ఆవరణలో మాట్లాడుతూ ఎస్జీటీలకు పదోన్నతి కల్పించడానికి హేతుబద్దీకరణ వల్ల ఆదోని నంద్యాల పురపాలక పాఠశాలలకు 150, ఆరు హెచ్ఎం పోస్టులు భార్తీ కానున్నాయన్నారు. ఇందుకు ప్రభుత్వానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. నాయకులు రమేష్ నాయుడు, ప్రహల్లాద, నాగరాజు, ఖలీల్, జుబేర్, లోక్యా నాయక్, భీమరాజు, విజయకుమార్ పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు వచ్చేశాయ్

- మండల స్టాక్ పాయింట్‌కు చేరిన పుస్తకాలు
- బడి తెరిచిన రోజే విద్యార్థులకు పంపిణీ



స్టాక్‌పాయింట్‌లో ఉన్న పుస్తకాలు

ఆదోని అగ్రికల్చర్, మే14 (ఆంధ్రజ్యోతి): విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పేరిట కిట్లు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు పూర్తి చేసింది. నియోజకవర్గంలోని మండల స్టాక్ పాయింట్‌కు పాఠ్య పుస్తకాలలు వచ్చే శాయి. విద్యాశాఖ సిబ్బంది వీటిని ఔపంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 130 ప్రాథమిక, ప్రాథమి కోన్నత, ఉన్నత పాఠశాలలు ఉండగా, 30 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ క్రమంలో ప్రతి ఒక్కరికి మిత్ర కిట్లు అందజేయనున్నారు. ఇందులో పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు బెల్ట్, బూట్లు ఉంటాయి.

మండల స్థాయి కమిటీ..

మండల స్థాయి కమిటీలో ఎంఈవో-2 అధ్యక్షుడిగా ఉంటారు. ఎంఈవో-1 మండల ఇంజినీరు, ఎంఐఎస్ సమన్వయకర్త లేదా డేటాఎంట్రీ ఆపరేటర్, సీఎంఆర్టీతో సహా మరో ముగ్గురు సభ్యులుం టారు. కిట్లను స్టాక్ పాయింట్‌ను చేర్చి సరి చూసుకొని రసీదులు ఇవ్వడం, యాప్‌లో అప్‌లోడ్ చేయడం తదితరాలను చేస్తారు

బడి తెరిచేనాటికి పంపిణీ



నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు 75% వచ్చాయి. వీటిని సంబంధిత పాఠశాలలకు చేరుస్తున్నాం, బడి తెరిచిన రోజే పంపిణీ చేస్తాము. ప్రతి విద్యార్థికి వీటిని అందజేయాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం. **- శ్రీనివాసులు, ఎంఈవో, ఆదోని**

నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలు



నవరత్నాల రథంపై ఊరేగుతున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, మే 14(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు నవరత్నాల రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. వైశాఖ బుధవారం విదియ పర్వ దినాన్ని పురస్కరించుకుని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆధ్వర్యంలో బృందావనానికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య నవరత్నాల రథంపై ప్రహ్లాదరాయలను అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. వివిధ రాష్ట్రాలనుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది.

విద్యార్థులు పుస్తకాలు చదవాలి

జిల్లా గ్రంథాలయ సెక్రటరీ ప్రకాష్



విద్యార్థుల బోధన తరగతుల గురించి అడిగి తెలుసుకుంటున్న జిల్లా గ్రంథాలయ సెక్రటరీ ప్రకాష్

ఎమ్మిగనూరు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సెక్రటరీ ప్రకాష్ అన్నారు. బుధవారం పట్టణంలో గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి పునఃశ్చరణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సభ్యత్వ నమోదు చేయించుకోవాలని అన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను చదివి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రంథాలయంలోని రిజిస్ట్రర్లను పుస్తకాలను సంబంధించిన రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి హరికృష్ణ పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే కఠినచర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

ఎమ్మిగనూరు రూరల్, మే 14(ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని రూరల్ ఎస్‌ఐ శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం కలుగొట్ల రోడ్డులో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా 15 వాహనాలకు రూ.30వేల జరిమానాను విధించారు. ఆయన మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపే సమయంలో ఒక్కసారి కుటుంబం గురించి ఆలోచించాలన్నారు. జరగరాని ప్రమాదం ఏదైనా జరిగితే ఆ కుటుంబమే రోడ్డుపాలు కావాల్సిన దుస్థితి ఏర్పడుతుందన్నారు. రోడ్డు భద్రతానియమాలను వాహనదారులు తప్పకుండ పాటించాలన్నారు. తనిఖీల్లో ఏఎస్‌ఐ ప్రాణేశ్వరరావు, కానిస్టేబుళ్ల రమేష్, గూడుబాషా, సర్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మంత్రాలయం, మే 14 (ఆంధ్రజ్యోతి): రెండు మోటార్ సైకిళ్ల ఢీకొనడంతో ముగ్గురికి గాయాలు అయ్యాయి. ఈ ఘటన మండలంలోని సూగూరు గ్రామ సమీపంలో బుధవారం జరిగింది. బాధితులు, గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు నందవరం మండలం హాలహర్వి నుంచి రచ్చుమర్రికి వెళ్తుండగా.. సూగూరు గ్రామానికి చెందిన ఉపాధి పనులు చేసుకుని మోటారు సైకిల్‌పై ఇంటికి వస్తుండగా.. ఢీకొన్నాయి. దీంతో నరసమ్మ, నరసప్పకు కాళ్లు విరిగాయి. జయలక్ష్మి తలకు తీవ్ర గాయాలైంది. చికిత్స నిమిత్తం 108 అంబులెన్సు ద్వారా ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేస్తామని మంత్రాలయం పోలీసులు తెలిపారు.

టీజీ వెంకటేశ్‌ను కలిసిన జనసేన నేత లక్ష్మన్న

కర్నూలు కల్చరల్, మే 14(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ మాజీ సభ్యుడ టీజీ వెంకటేశ్‌ను జనసేన పార్టీ మంత్రాలయం నియోజకవర్గం ఇన్‌చార్జి బి.లక్ష్మన్న బుధవారం బుధవారం టీజీ స్వగృహంలో కలిసి సత్కరిం చారు. లక్ష్మన్న మాట్లాడుతూ టీజీ వెంకటేశ్ ఏనాడూ పదవుల కోసం పాకులాడలేదని, ఆయన దగ్గరికే పదవులు వెతుక్కుంటూ వచ్చాయ న్నారు. ఆయన భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు బీవీ రవిచంద్ర, బీవీ రాజేష్, వరప్రసాద్, రాఘవేంద్ర, రఘు పాల్గొన్నారు.



టీజీ వెంకటేశ్‌ను సత్కరిస్తున్న లక్ష్మన్న

ఉల్లి నారుకు గిరాకీ

● మడి రూ.2000 నుంచి రూ.2500
● ఎకరా సాగుకు రూ.1.50లక్షలు

గోనెగండ్ల, మే 14(ఆంధ్రజ్యోతి): ఉల్లికి మంచి ధర పలుకుతుందనే ఆశతో రైతులు ఉల్లి సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఎండలు మండిపోతుండటంతో ఉల్లినారను వేసేందుకు రైతులు ఎక్కువ మంది ముందుకు రాలేదు. దీంతో నర్సరీలు, నీరు పుష్కలంగా ఉండే ప్రాంతాల్లో ఉల్లినారను వేశారు. దీంతో అరకొరగా ఉన్న ఉల్లి నారకు గిరాకీ పెరిగింది. బావులు, బోర్లు ఉన్న రైతులు ముందకు రావడతో ఒక్కసారిగా ఉల్లినారు ధర ఆకాశాన్ని అంటింది. ఒక బెడ్(మడి) ధర రూ. 2000 నుంచి రూ. 2500 పలుకుతుంది. ఒక ఎకరంలో ఉల్లినారు సాగుకు రూ.1.50లక్ష ఖర్చు అవుతుంది. ఉల్లి విత్తనాల రేటు కూడా కిలో రూ.150 నుంచి రూ.600 వరకు పెరి గింది. ఒక ఎకరానికి 200 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. ఒక ఎకరంలో 190 నుంచి 200వరకు ఉల్లినార బెడ్లు పడతాయి. ఒకఎకరంలో ఉల్లిపంటను సాగు చేసేందుకు ఆరు నుంచి ఎనిమిది బెడ్లునారు (మడి) కావాల్సి ఉంటుంది. ఉల్లినారకు ధర పెరగడంతో వీటిని సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ఇదే ధర కొనసాగితే ఉల్లినారు సాగు చేసిన రైతులకు కనకవర్షమే.



గోనెగండ్లలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ఉల్లినారు

అకాల వర్షం..అతలాకుతలం





తెగిన విద్యుత్ తీగలు , నేలకూలిన భారీ వృక్షం

● నేలకొరిగిన భారీ వృక్షం
● తెగిపడిన విద్యుత్ తీగలు

ఎమ్మిగనూరు రూరల్, మే14(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కురిసిన భారీ వర్షంతో అంతా అతలాకుతలమైంది. సాయంత్రం దాదాపు గంటపాటు కురిసిన భారీ వర్షానికి చెట్లు నేలకొరిగాయి. విద్యుత్ స్తంభాలకు ఉన్న విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. మండలంలోని బనవాసి, వెంకటగిరి, కొటేకల్లు గ్రామాల్లో కురిసిన వర్షానికి పొలాల్లో నీరు నిలిచాయి. వెంకటగిరి గ్రామంలో భారీ చెట్లు నేలకొరిగి, విద్యుత్ స్తంభాలకు ఉన్న తీగలు తెగికిందపడ్డాయి. వర్షపునీటితో ఫారంపండ్స్ నిండుగా కనిపించాయి.



వెంకటగిరిలో వంకలో పారుతున్న వర్షపునీరు

సేంద్రియ పద్ధతులతో

అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త సుజాతమ్మ

గోనెగండ్ల, మే 14(ఆంధ్రజ్యోతి): సేంద్రియ, ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడులు సాధించవచ్చని శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త రవీంద్రనాథ్‌రెడ్డి, ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుజాత అన్నారు. బుధవారం మండలంలోని వేముగోడులో ఏరువాక కేంద్రం, శ్రీకృష్ణ దేవరాయ వ్యవసాయ కళాశాల విద్యార్థుల సంయుక్తంగా రైతు సదస్సు, వ్యవసాయ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులను ఉద్దేశించి వారు మాట్లాడుతూ వరిలో యాజమాన్య పద్ధతుల గురించి వరిలో నూతన వంగడాల ఎంపిక గురించి వివరించారు. ఎరువులు, పురుగులు తెగుళ్లు, యాజమాన్య పద్ధతులను తెలిపారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతు ఉత్పత్తి సంఘాలు, వాటి ప్రాముఖ్యత, కేంద్ర ప్రభుత్వ రైతుల కోసం ప్రవేశపెట్టిన పథకాలను గురించి వివరించారు. వ్యవసాయ విద్యార్థులు వారి చివరి ఏడాది వారి ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా మూడు నెలలు పాటు వేముగోడు గ్రామంలో ఉంటూ రైతు పొలాలను సందర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్ర మంలో ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, రవికిషోర్, సోమసుందర్, సుస్మిత, ఏవో హేమలత, జాకీర్, రైతులు పాల్గొన్నారు.

కౌతాళం ఏపీవో సస్పెన్షన్

కౌతాళం, మే 14(ఆంధ్రజ్యోతి): ఉపాధి కార్మికులకు పనులను కల్పించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కౌతాళం ఏపీవో బజారిని డ్వామా పీడీ వెంకట రమణయ్య సస్పెండ్ చేశారు. బుధవారం మండలంలోని ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఏపీవో బజారి విధులకు హాజరుకాకుండా ఎలాంటి సమాచారం లేకుండా డుమ్మా కొట్టడంతో సస్పెండ్ చేసినట్లు పీడీ తెలిపారు. అనంతరం బదినేహల్ గ్రామంలో ఉపాధి పనులను పరిశీలించి కార్మికులతో మాట్లాడి సకాలంలో వేతనాలు అందేలా చూస్తానని తెలిపారు. అలాగే గ్రామంలో ఉద్యాన పంటలను ప్రోత్సహించడంలో భాగంగా గ్రామంలో డ్రాగన్ పంటను పరిశీలించారు. వీరి వెంట ఎంపీడీవో విజయశేఖరరావు, టీసీ రఫీక్ ఉన్నారు.



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ వెంకట రమణయ్య

ఘనంగా

గద్దెరాళ్ల మారెమ్మ దేవర

ఎమ్మిగనూరు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఏడో వారులో వెలసిన గద్దెరాళ్ల మారెమ్మదేవి దేవర భక్తులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఉపవాసం ఉంటూ తెల్లవారుజాము నుంచే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుంటూ అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రతి అమవాస్య రోజు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు గంగన్న తెలిపారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ దేవరకు అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. కార్యక్రమంలో నాగన్న, ఉరుకుంద, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న అమ్మవారు

రాఘవరాయుడికి స్వర్ణ కవచ సమర్పణ

మంత్రాలయం, మే 14 (ఆంధ్రజ్యోతి): వేద పండితుల మంత్రోచ్ఛరణాలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవ్రేందస్వామి మూల బృందావనానికి బంగారు కవచ సమర్పణ సేవ రమణీయంగా సాగింది. బుధవారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు ఆధ్వర్యంలో పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. పీఠాధిపతి హస్తోదకం చేసి మహామంగళహారతులు ఇచ్చారు.



స్వర్ణ కవచంతో అలంకరించిన రాఘవరాయుడి బృందావనం

స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా శ్రీహరి

కర్నూలు లీగల్, మే 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు ఎస్సీ, ఎస్టీ కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా న్యాయవాది వై.శ్రీహరిని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయన బుధవా రం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమో దైన కేసులను ప్రాసిక్యూషన్ తరపున నిర్వహించడమే కాకుండా ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా కూడా బాధ్యతలను నిర్వహిస్తారు. ఈయన 2006లో న్యాయవాదిగా ఎన్‌రోల్‌మెంటు చేసు కుని ప్రాక్టీసును ప్రారంభించి సివిల్ క్రిమినల్ కేసులలో అనుభవాన్ని గడించారు. ఈయన నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు.



సమ్మెను విజయవంతం చేయాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు

ఎమ్మిగనూరు టౌన్, మే 14 (ఆంధ్రజ్యోతి): కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌ల రద్దు కోసం ఈనెల 20న చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెను విజయవంత చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు పిలుపునిచ్చారు. స్థానిక ఎన్జీవోస్ భవన్‌లో ప్రజాసంఘాల ఆధర్యంలో సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావే శంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్ నాగమణి, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎస్ దేవసహాయం మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికులు సాధించుకున్న చట్టాలను అమలు చేయడంలోనే నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తుందన్నారు. నాలుగు లేబర్ చట్టాలు అమలు అయితే కార్మికులు బానిసలుగా మారే పరిస్థితి ఉందని అన్నారు. దేశవ్యాప్తంగా జరిగే సమ్మెకు ప్రజా సంఘాలు ప్రత్యక్ష మద్దతు తెలుపుతూ ఈసమావేశంలో పాల్గొన్నాయి. కార్యక్రమంలో బేడ బుడగ జంగాల సంఘం నాయకులు బి దస్తగిరి. ఐఎఫ్‌టీయూ తాలూకా నాయకులు బాలరాజు, కేఎంఎస్ నాయకులు ఎస్ రాజు, ఏఐకేఎంఎస్ నాయకులు సత్యన్న, నాయకులు తిమ్మగురుడు, కేశన్న, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజనేయులు

ఎమ్మార్సీ భవనానికి చేరిన నోట్‌పుస్తకాలు



ఎమ్మార్సీకి చేరిన పుస్తకాలతో ఎంఈఓ-2 శోభారాణి

కౌతాళం, మే 14(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యా సంవత్సరం 2025-26 సంవత్సరానికి సంబంధించిన 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నోట్‌పుస్తకాలను అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా బుధవారం నోట్ పుస్తకాలు74,886లు ఎమ్మార్సీ భవనానికి చేరినట్లు ఎంఈఓ-2 శోభారాణి తెలిపారు. త్వరలో షూస్‌తో పాటు స్కూల్ బ్యాగ్‌లు కూడా వస్తాయన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైయ్యేలోపు విద్యార్థులకు అందేలా చేస్తామన్నారు.

రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా: డీఎస్పీ



పోలీసులకు సూచలిస్తున్న డీఎస్పీ

కౌతాళం, మే 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రౌడీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. మండల పరిధిలోని నదిచాగి, రౌడూరు, బాపురం పికెట్లను బుధవారం పరిశీలించి అక్కడ రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఫ్యాక్షన్ నిర్మూలనకు చేపట్టాల్సిన విధానాలను గురించి కౌతాళం సీఐ అశోక్ కుమార్‌తో చర్చించారు. అనంతరం డీఎస్పీ మాట్లా డుతూ గ్రామాల్లో ఎవరైన అసాంఘిక కార్యాకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదన్నారు. ఫ్యాక్షన్ జోలికి వెళ్లి జీవితాలను నాశనం చేసు కోవద్దని సూచించారు. పిల్లలను బాగా చదివించి మంచి పౌరులుగా తీర్చిదిద్దాలని తెలిపారు. అనంతరం బాపురం చెక్ పోస్టును తనిఖీ చేశారు.

సద్గురు సేవాలాల్ ఆలయం ప్రారంభం



సద్గురు సేవాలాల్‌ను దర్శించుకుంటున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, మే 14 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం మండలంలోని పరమాన్‌దొడ్డి తండా గ్రామంలో గ్రామస్థుల సహకారంతో నూతనంగా నిర్మించిన సద్గురు సేవాలాల్ మహారాజ్ నూతన ఆలయాన్ని ప్రారంభించారు. బుధవారం నూతన ఆలయంలో వెంకటేశ్వర్లు నాయక్ ఇచ్చిన నూతన విగ్రహాన్ని, గోపుర కలశాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం నుంచి సద్గురు సేవాలాల్‌కు అభిషేకాలు, నైవేద్యాలు, విశేష అలంకరణ చేశారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డికి గ్రామస్థులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా నాయకులు ఎస్ఎం గోపాల్ రెడ్డి, కేశయ్య నాయక్, శంకర్ నాయక్, హనుమంతునాయక్, గంగనాయక్, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలి

పెద్దకడుబూరు, మే 14(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రంథాలయ సెక్రటరీ ప్రకాష్ కోరారు. బుధవారం పెద్దకడుబూరు గ్రంథాలయాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలను చదివితే అక్షరజ్ఞానంతో పాటు మేధాశక్తి పెరుగుతుందన్నారు. ఈపరిశీలనలో గ్రంథాలయం అధికారి ఆశాజ్యోతి ఉన్నారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం

పెద్దకడుబూరు , మే 14(ఆంధ్రజ్యోతి): జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరివేసుకొని బలవన్మరణానికి చేసుకున్నాడు. ఈఘటన మండల పరిధిలోని చిన్నకడుబూరు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రా మస్థులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బోయ కలుగొట్ల నాగన్న(36)కు 15 ఏళ్ల క్రితం పెళ్లైంది. అయితే భార్య పదేళ్ల నుంచి పుట్టింటిలోనే ఉండడంతో జీవితంపై విరక్తి చెంది తాగుడుకు బానిసయ్యాడు. దీంతో బుధవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి ఒక కుమార్తె, ఒక కుమార్తె ఉన్నారు.